తెలుగు దినపత్రిక
https://aksharagalam.com
# అక్షరగళం
ప్రతి అక్షరం ప్రజల కోసం

పేజీలు: 8 | వెల: 3 | సంపుటి:3 | సంచిక: 233

గురువారం 20, జనవరి 2026

॥ ఎడిటర్: దయాకర్ రెడ్డి ॥

## పేదల నోరు కొడుతున్న ప్రధాని మోడీ



ఉపాధిని మార్చడంపై నిరసనలో మహేశ్ కుమార్

**మెదక్,జనవరి28(అక్షరగళం):** ప్రధాని మోడీ పేదవాళ్ళ నోటికాడి ముద్దను లాక్కోవాలని చూస్తున్నాడని టీ పీసీసీ చీఫ్ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ ఫైర్ అయ్యారు. జాతీయ ఉపాధి హామీ చట్టం పథకం నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించడాన్ని ఖండిస్తూ మెదక్ జిల్లాలో నరేగా బచావో, బీజేపీ హటావో నినాదంతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. మోడీ గరీబోళ్లను కష్ట డుతున్నారని అన్నారు. గరిబోళ్ళకోసం సోనియా గాంధీ అనంతపురం పర్యటనలో ఉన్నపుడు పనికి ఆహార పథకం తీసుకొచ్చారని చెప్పారు. అనంతరపురంలో అన్ని ఇళ్లకు తాళాలు ఉంటే...సోనియా గాంధీ మన్మోహన్ సింగ్ కు చెప్పి పనికి ఆహార పథకాన్ని మొదలు పెట్టారని చెప్పారు. గ్రామ జనం పటిష్టంగా ఉంటే గ్రామాలు సౌభాగ్యంగా ఉంటాయన్నారు. కానీ మోడీ, అదానీ, అంబానీల కోసం పనికి ఆహర పథకాన్ని తొలగించాలని చూస్తున్నారని విమర్శించారు. పనికి ఆహర పథకం కోసం సోనియా గాంధి, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ పార్లమెంట్‌లో పోరాటం చేస్తున్నారని చెప్పారు.



## బోధనలో నాణ్యత పెరగాలి

**ప్రతి విద్యాసంస్థలో మెరుగైన బోధన**

**విద్యాశాఖపై ఉన్నతాధికారులతో సిఎస్ సమీక్ష**

**హైదరాబాద్,జనవరి28(అక్షరగళం):** ప్రభుత్వ పాఠశాలలు, విద్యా సంస్థలలో బోధనలో నాణ్యత ప్రమాణాలు మరింతగా పెంచాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, విశ్వ విద్యాలయాల స్థాయి వరకు ప్రతి విద్యా సంస్థలోను మెరుగైన బోధన సాగాలని, విద్యా బోధనలలో నాణ్యత ప్రమాణాలు పెంచే దిశగా కార్యాచరణ రూపొందించుకోవాలని సి.ఎస్ ఆదేశించారు. గౌరవ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు విద్యాశాఖ పై సంబంధిత ఉన్నతాధికారులతో బుధవారం డా.బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మిగతా.. 2లో

## జాతర ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలి

- ఆదివాసులు అస్తిత్వం దెబ్బతినకుండా మార్పులు
- భక్తులకు వసతి కల్పించేలా జాతరకు భారీగా ఏర్పాట్లు
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



**ములుగు,జనవరి28 (అక్షరగళం):** సమక్క సారలమ్మ జాతర ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలని రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క) అన్నారు. మేడారం సమ్మక్క సారలమ్మ జాతర వద్ద ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌లో బుధవారం జాతరను ప్రెస్ కవరేజ్ చేస్తున్న వివిధ మీడియా సంస్థలకు చెందిన జర్నలిస్టులకు, మీడియా ప్రతినిధులకు మంత్రి సీతక్క టీ షర్ట్‌లను పంపిణీ చేశారు.మంత్రి సీతక్క మాట్లాడుతూ, కోట్లాది మంది భక్తుల కొంగు బంగారంమైన సమక్క సారలమ్మ మిగతా.. 2లో



## చరిత్రలో నిలిచేలా మేడారంలో శాశ్వత వసతులు

- రూ.251 కోట్లతో మహాజాతర అభివృద్ధి పనులు
- రద్దీని తట్టుకునే క్యూ లైన్లు, శాశ్వత గద్దెలు, ఆధునిక వసతులు
- ప్లాస్టిక్ రహితంగా గద్దెల పరిసరాలు




**హైదరాబాద్,జనవరి28 (అక్షరగళం):** ఆసియా ఖండంలోనే అతిపెద్ద ఆదివాసీ జాత రగా గుర్తింపు పొందిన శ్రీ సమ్మక్క-సారలమ్మ మేడారం మహాజాతర-2026ను చరిత్రలో నిలిచిపోయేలా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం విస్తృత స్థాయిలో శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టింది. మొత్తం రూ.251 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ పనులు పూర్తి అయ్యి భక్తుల మన్ననలు పొందుతున్నాయ్. భక్తుల సర్వత్ర ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రెండు సంవత్సరాలకు మాఘ పౌర్ణమి సందర్భంగా జరిగే ఈ జాతరకు మిగతా.. 2లో



## నేడు మేడారంకు కేంద్ర గిరిజన శాఖ మంత్రి జుయల్ ఓరం

- రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి అడ్లూరి విజ్ఞప్తి మేరకు రాక

**హైదరాబాద్,(అక్షరగళం):** ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా ప్రసిద్ధి గాంచిన సమ్మక్క సారలక్క జాతరకు గురువారం కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జుయల్ ఓరంగారు పాల్గొని పూజలు నిర్వహించను న్నారు. ఇటీవల హైదరాబాద్ లోని కన్హా శాంతి వనంలో జరిగిన గిరిజన గ్రామీణ వైద్య సహకారుల సదస్సులో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి మిగతా.. 2లో



## సరికొత్త ఆధార్ యాప్ లాంచ్

- సరళంగా,సురక్షితంగా ఉండేలా చర్యలు

**న్యూఢిల్లీ,జనవరి28(అక్షరగళం):** కేంద్ర ప్రభుత్వం సరికొత్త ఆధార్ యాప్‌ను లాంచ్ చేసింది. దేశ డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలను బలోపేతం చేసే లక్ష్యంతో దీనిని తీసుకొచ్చింది. ఈ కొత్త యాప్‌తో ఆధార్ సర్వీసులు మరింత సరళంగా, సురక్షితంగా, యూజర్ ఫ్రెండ్లీగా మారనున్నాయి. మిగతా.. 2లో

## వికసిత్ భారత్ వైపు దేశం పయనిస్తోంది



- పదేళ్లలో పేదల కోసం 4కోట్ల ఇళ్ల నిర్మాణం
- జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామాలకు తాగునీరు
- వందేభారత్, అమృత్ భారత్ రైళ్ల ద్వారా సేవలు
- ఆయుష్మాన్ భారత్‌తో కోట్లమందికి వైద్యం
- వరిధాన్యం ఉత్పత్తిలో ప్రపంచంలో నంబర్ వన్
- అక్వా, పాల ఉత్పత్తుల్లో భారత్ ముందంజ
- గత 11 ఏళ్లలో భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి
- జిఎస్‌టి శ్లాబుల తగ్గింపుతో పెరిగిన కొనుగోలు శక్తి
- పవర్ టెక్నాలజీ హబ్‌గా రూపొందుతున్న భారత్
- గ్రీన్ ఎనర్జీ రంగంలో పవర్ హౌస్‌గా భారత్
- పార్లమెంటు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం

**న్యూఢిల్లీ,జనవరి28(అక్షరగళం):** దేశం వికసిత్ భారత్ వైపు పయనిస్తోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చెప్పారు. పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, గత పదేళ్లలో పేదల కోసం 4కోట్ల ఇళ్లు కట్టించామని, జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామాలకు తాగునీరు అందిస్తున్నామని రాష్ట్రపతి తెలిపారు. మిగతా.. 2లో

## సుప్రీం ఆదేశాలతో అనర్హతపై స్పీకర్ విచారణ



- ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు నోటీసులు జారీ
- 30న ఉదయం స్పీకర్ కార్యాలయంలో హాజరు కావాలని ఆదేశం

**హైదరాబాద్,జనవరి28(అక్షరగళం):** తెలంగాణ రాజకీయాల్లో ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల అంశంపై సుప్రీంకోర్టు సీరియస్ కావడంతో.. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వేగం పెంచారు. ఇందుకు సంబంధించి తాజాగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు స్పీకర్ నోటీసులు జారీ చేశారు. ప్రస్తుతం ఈ విషయం రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ నెల 30వ తేదీన ఉదయం స్పీకర్ కార్యాలయంలో హాజరు కావాలని దానం నాగేందర్‌ను ఆదేశించారు. అదేవిధంగా ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి కూడా నోటీసులు అందాయి. ఇందులో భాగంగా ఉదయం 10:30 గంటలకు మిగతా.. 2లో


## కరీంనగర్ కార్పొరేషన్‌లో కాంగ్రెస్ జెండా ఎగరాలి

**అభ్యర్థుల ఎంపికకు సమర్థత ఆధారంగా సర్వే**


**పట్టణాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికతో సాగుతున్నాం**

**డీసీసీ సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్**

**కరీంనగర్,జనవరి28(అక్షరగళం):** కరీంనగర్ కార్పొరేషన్ లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కరీంనగర్ కార్పొరేషన్ లో అభ్యర్థుల ఎంపికకు 66 సీట్లలో సర్వే జరుగుతుందని.. ఎవరికివారు అంచనా వేసుకోండని ఆశావహులకు సూచించారు. బుధవారం మిగతా.. 2లో



## దేశానికే రోల్‌మోడల్‌గా డిజాస్టర్ మేనేజిమెంట్



- రూ.100 కోట్లతో అత్యాధునిక పరికరాలు
- రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ శిక్షణా కేంద్రం
- క్షేత్రస్థాయి వరకు అడ్వాన్స్‌డ్ వెదర్ స్టేషన్లు ఏర్పాటు
- రాష్ట్ర రెవెన్యూ,హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్,జనవరి28(అక్షరగళం):** ప్రకృతి విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొని వీలైనంత వరకూ ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా రాష్ట్రంలో ప్రకృతి విపత్తుల నిర్వహణా సంస్థ విభాగాన్ని బలోపేతం చేసి దేశానికి ఒక రోల్ మోడల్‌గా ఉండేలా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఎటువంటి విపత్తులనైనా ఎదుర్కొనేలా వంద కోట్ల రూపాయిలతో అత్యాధునిక పరికరాలను కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఇందుకు సంబంధించి బుధవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో విపత్తుల నిర్వహణా విభాగం, ఫైర్ సర్వీసెస్, ఎస్‌డిఆర్ఎఫ్, హైడ్రా, ఐ సిసిసి విభాగాలతో సమావేశం నిర్వహించి ఎలాంటి పరికరాలను మిగతా.. 2లో



- అజిత్ పవార్ విమాన ప్రమాదంపై కీలక అప్‌డేట్స్
- 8.30 గంటలకు బారామతిలో విమానం ల్యాండింగ్‌కు యత్నం
- పైలట్లకు రన్‌వే సరిగ్గా కనిపించక పయత్నం విఫలం
- విమాన ప్రమాదంతో డిప్యూటీ సిఎం అజిత్ పవార్ దుర్మరణం
- పవార్‌తో పాటు ఇద్దరు సహాయకులు, ఇద్దరు పైలెట్లు మృతి



## మహారాష్ట్ర రాజకీయాల్లో తీరని విషాదం

**ముంబై,జనవరి 28(అక్షరగళం):** మహారాష్ట్ర రాజకీయాల్లో తీరని విషాద ఘటన చోటు చేసుకుంది. ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ అనంతరావు పవార్ బుధవారం బారామతి దగ్గర చార్టర్డ్ విమానం కూలిపోవడంతో దుర్మరణం చెందారు. ఈ ఘటనలో ఆయనతోపాటు విమానంలో ఉన్న మరో నలుగురు కూడా ప్రాణాలు కోల్పోయారు. ముంబై నుంచి బారామతి వెళ్తున్న ఈ ప్రైవేట్ ఎయిర్‌క్రాఫ్ట్ ఉదయం 8:45 గంటల సమయంలో క్రాష్ అయినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. అజిత్ పవార్ వయసు 66 సంవత్సరాలు. మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ ప్రయాణిస్తోన్న విమానం బారామతిలో ల్యాండ్ అయ్యే సమయంలో కుప్పకూలినట్టు తెలుస్తోంది. కూలిన వెంటనే విమానం నుంచి పెద్ద ఎత్తున మంటలు

## రన్‌వే గుర్తింపులో పైలట్లు ఇబ్బంది

- ల్యాండ్ అయ్యేందుకు యత్నించగా ప్రమాదం
- డిజిసిఎ అధికారుల వెల్లడి

**ముంబై,జనవరి28(అక్షరగళం):** మహారాష్ట్రలో జరిగిన ఘోర విమాన ప్రమాద ఘటనపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ కీలక విషయాలను వెల్లడించింది. మిగతా.. 2లో

## రన్‌వేపై విజిబిలిటీ తక్కువతోనే ప్రమాదం

- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడి



**ముంబై,జనవరి28(అక్షరగళం):** మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ విమాన ప్రమాదంలో మృతి చెందిన ఘటనపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు స్పందిస్తూ.. ప్రాథమిక వివరాలనువెల్లడించారు. ప్రమాదం జరిగిన సమయంలో బారామతి విమానాశ్రయంలో విజిబులిటీ తగ్గినట్లు తేలిందని మంత్రి తెలిపారు. ల్యాండింగ్ సమయంలో రన్‌వే స్పష్టంగా కనిపిస్తుందా లేదా మిగతా.. 2లో



## నేను బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయలేదు

**అఫిడవిట్‌లో స్పీకర్‌కు వివరించిన దానం నాగేందర్**

**హైదరాబాద్,జనవరి28(అక్షరగళం):** తెలంగాణలో బీఆర్ఎస్ ఫిరాయింపు ఎమ్మెల్యే వ్యవహారంలో కొత్త పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై బీఆర్ఎస్ దాఖలు చేసిన అనర్హత పిటిషన్‌పై, ఆయన స్పీకర్‌కు వినతిపత్రం అందజేశారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారన్న ఆరోపణలను దానం నాగేందర్ ఘాటుగా ఖండిస్తూ, ఆ పిటిషన్‌ను కొట్టి వేయాలని స్పీకర్‌ను కోరారు. అఫిడవిట్‌లో దానం నాగేందర్ తాను బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయలేదని, అలాగే పార్టీ తనను సస్పెండ్ చేసినట్లు సమాచారమూ అధికారికంగా మిగతా.. 2లో

తెలుగు దినపత్రిక https://aksharagalam.com
అక్షరగళం
ప్రతి అక్షరం ప్రజల కోసం

# చరిత్రలో నిలిచేలా మేడారంలో శాశ్వత వసతులు

(మొదటి పేజీ తరువాయి)

'తెలంగాణ కుంభమేళా'గా విశేష ఖ్యాతి ఉంది. లక్షలాది కాదు? కోట్లాది మంది భక్తులు తరలివచ్చే ఈ మహాజాతర ఈసారి పునర్నిర్మాణ పనుల వల్ల మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. గతంలో ప్రతి జాతర సందర్భంగా తాత్కాలిక వసతులతో సరిపెట్టిన పరిస్థితికి భిన్నంగా, ఈసారి వందల ఏళ్లపాటు నిలిచేలా పూర్తి రాతి కట్టడాలతో





గద్దెల చుట్టు పునర్నిర్మాణం చేపట్టారు. ఆదివాసీ పెద్దలు, పూజారుల సంఘం సంపూర్ణ ఆమోదంతోనే ప్రభుత్వం ఈ పనులకు శ్రీకారం చుట్టింది. గద్దెల విస్తరణకు మాత్రమే రూ.101 కోట్లు. సుమారు 4,000 టన్నుల గ్రానైట్‌తో గద్దెల ప్రాంగణాన్ని చారిత్రక కట్టడాల మాదిరిగా నిర్మించారు. 46 స్తంభాలతో 271 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ప్రాకారం, 8 స్తంభాలతో వృత్తాకార గద్దె, 50 అడుగుల వెడల్పుతో ప్రధాన స్వాగత తోరణం ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. మేడారం గద్దెల చుట్టూ నిర్మిస్తున్న 32 గ్రానైట్ పిల్లర్లపై ఆదివాసీ సంస్కృతి, ఆచారాలు, జీవనశైలి, కోయ వంశ చరిత్రను శిల్పాల రూపంలో చెక్కించారు.

30 ఏళ్ల నాటి కోయల తాళపత్ర గ్రంథాల ఆధారంగా రూపొందించిన ఈ శిల్పాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు, జంపన్నతో పాటు ప్రకృతిలో మమేకమై జీవించే ఆదివాసుల జీవన వైవిధ్యాన్ని ప్రతిభింబించే పులి, జింక, ఏనుగు, నెమలి వంటి వన్యప్రాణుల ప్రతిరూపాలు చెక్కించారు. సుమారు 750 కోయ ఇంటి పేర్లు, 7,000కు పైగా శిల్పాలు గిరిజన చరిత్రను భావితరాలకు తెలియజేసేలా రూపొందించారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని 60 అడుగుల నుంచి నాలుగు లైన్ల రోడ్ల విస్తరణ, శాస్త్రీయ క్యూ లైన్లు, వాచ్ టవర్లు, సత్రాలు ఏర్పాటు చేశారు.

ఃార్కింగ్ సమస్య తలెత్తకుండా 42 ప్రదేశాల్లో 1,418 ఎకరాల విస్తీర్ణంలో వాహనాల పార్కింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. తల్లుల దర్శనానికి సకల ఏర్పాట్లు ? జనంరణ్యమైన ములుగు అటవీ ప్రాంతం మేడారం ఈ చేరే అన్ని రహదారులు వాహనాల రాకపోకలు, భక్తుల గుడారలతో ములుగు అటవీ ప్రాంతం.

ముఖ్యంగా తాడ్వాయి మదలం గత నెల రోజుల నుండి రద్దీగాగా మారింది. జాతర ముఖ్య గట్టలు ప్రారంబ మైనందున మేడారం జనారణ్యమైంది. గత జాతరకు సుమారు రెండు కోట్ల మంది భక్తులు హాజరవ్వగా, ఈసారి మూడు కోట్ల మంది వస్తారని అంచనా. గత నెల రోజుల నుండి దాదాపు 1 కోటి పైన భక్తులు సమ్మక్క సారలమ్మ అమ్మ వార్లను దర్శించుకున్నారు. ఈ నేపథ్యంలో జాతర నిర్వహణ పగడ్బందీగా ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌ కర్యం కల్గకుండా జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది.

21 శాఖల సమన్వయంతో 42,027 మంది అధికారులు, సిబ్బందిని విధులు నిర్వహిస్తున్నారు. జాతర ప్రాంతాన్ని 8 జోన్లు, 42 సెక్టార్లుగా విభజించి ప్రత్యేక అధికారులను నియమించారు. అన్నీ సెక్టార్ లకు వాకీ టాకీ లను ఏర్పాటు చేసి సెక్టార్ వారీగా ఏ ఇబ్బంది లేకుండా అధికారులు సమన్వయం తో పని చేస్తున్నారు. వైద్య సేవల కోసం 108 అంబులెన్సులు, బైక్ అంబులెన్సులు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఆసుపత్రి ద్వారా ఎప్పటికప్పుడు వైద్య సేవలు అందిస్తునారు. స్పెషలైస్డ్ డాక్టర్స్ మందులు అన్నీ అందుబాటులో ఉంచారు. అగ్నిమాపక, బృందాలు, జంపన్నవాగులో ఈతగాళ్లను మోహరించారు. జంపన్న వాగులో భక్తులు ప్రమాదం బారిన పడకుండా చర్యలు తీసుకున్నారు. డిజిటల్ యుగంలో మేడారం సమాచారాన్ని అంధిచేందుకు డిజిటల్ వేదికను జిల్లా యంత్రాంగం యెంచుకున్నది. భక్తుల సౌకర్యం కోసం మేడారం జాతర 2026 మొబైల్ యాప్, అధికారిక వెబ్‌సైట్, వాట్సాప్ చాట్‌బాట్‌ను ప్రభుత్వం ప్రారంభించింది. భక్తులకు మేడారం జాతర పూర్తి సమాచారం డిజిటల్ ఎలాట్ ఫామ్ అందిస్తున్నారు. పార్కింగ్, వైద్య శిబిరాలు, టాయిలెట్లు, ఃూక్షా సేవలు, మిస్సింగ్ పర్సన్స్ వివరాలు ఒక్క క్లిక్‌తో తెలుసుకునే వెసులుబాటు కల్పించారు.

ప్రకృతే దేవత అన్న ఆదివాసీ తత్వానికి అనుగుణంగా ఈసారి ప్లాస్టిక్ రహిత మేడారం నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రకృతిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్క భక్తుడి పై వుందని మంత్రి సీతక్క కలెక్టర్ దివాకర పిలుపునిచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పంచాయతీరాజ్ మంత్రి సీతక్క పర్యవేక్షణలో, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ సారథ్యంలో ఈసారి మేడారం మహాజాతరను ప్రపంచ స్థాయిలో ఆదర్శంగా నిలపాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

## జాతర ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలి

(మొదటి పేజీ తరువాయి)

జాతరకు భక్తుల రాక విపరీతంగా పెరిగిపోయిందని అన్నారు. ములుగు జిల్లాలో నిర్వహించే జాతర లో ప్రస్తుత సంవత్సరం అనేక మార్పులు చేసినప్పటికీ ఎక్కడ కూడా ఆదివాసుల అస్థిత్వం, ఆత్మగౌరవం, పూజ విధానం లో మార్పు లేకుండా ఏర్పాట్లు చేశామని అన్నారు. జాతరకు పెద్ద ఎత్తున వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా రోడ్డు విస్తరణ, మెరుగైన పారిశుధ్య చర్యలు, విద్యుత్ దీపాలంకరణ, క్యూ లైన్ సౌకర్యాలు మెరుగయ్యాయని అన్నారు. సమ్మక్క సారలమ్మ జాతర తీసుకొచ్చే విధానం పూజ వ్యవహారాలలో ఎటువంటి మార్పు రాలేదని అన్నారు. 4 రోజులు జరిగే సమక్క సారలమ్మ జాతరకు ప్రస్తుత సంవత్సరం 40 రోజుల సరిపడా ఏర్పాట్లు చేశామని అన్నారు. భక్తులకు అవసరమైన టాయిలెట్స్, త్రాగు నీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణకు అదనపు కార్మికులను ముందుగానే జాతర స్థలం వద్ద సిద్ధం చేశామని అన్నారు. సమక్క సారలమ్మ జాతరకు ఇప్పటి వరకు 20 లక్షల భక్తులు వచ్చారని అంచనా వేశామని అన్నారు. మక్క సారలమ్మ జాతర కవర్ చేసే అదృష్టం పాత్రికేయులకు కలిగిందని, జాతర యొక్క ఔన్నత్యం గొప్పతనాన్ని బయట ప్రపంచానికి మీడియా చాటి చెప్పాలని మంత్రి తెలిపారు. రాబోయే సమ్మక్క సారలమ్మ జాతర సమయానికి మీడియా కు సైతం పెద్ద హాల్, మెరుగైన వసతులు కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ అదనపు సంచాలకులు డి.ఎస్.జగన్, ఉప సంచాలకులు వెంకటేశ్వర్లు, వెంకట సురేష్ సంబంధించిన పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు మేడారంకు కేంద్ర గిరిజన శాఖ మంత్రి జుయల్ ఓరం

(మొదటి పేజీ తరువాయి)

లక్ష్మణ్ కుమార్ కేంద్ర మంత్రిని కలిసి సమ్మక్క సారలక్క జాతర ఆహ్వాన పత్రికను రాష్ట్ర ప్రభుత్వం తరపున అందించారు. అలాగే, ఈ జాతర ప్రత్యేకతను వివరించడంతో పాటు జాతర ప్రాశస్త్యతను చెప్పడంతో కేంద్ర మంత్రి తప్పకుండ జాతరలో పాల్గొంటానని హామీ ఇచ్చారు. ఇందులో భాగంగానే కేంద్ర మంత్రి ఈ జాతరకు హాజరవుతున్నారు. హెలిప్యాడ్ ద్వారా ఉదయం మేడారం కు కేంద్ర మంత్రి చేరుకుంటారు. అక్కడ మంత్రి అడ్లూరి, కేంద్ర మంత్రిని ఆహ్వానం పలికి కేంద్ర మంత్రిని వెంటబెట్టుకొని సమ్మక్క సారలక్క దేవస్థానాన్ని చేరుకొని ప్రత్యేక పూజలు చేయనున్నారు.

## సరికొత్త ఆధార్ యాప్ లాంచ్

(మొదటి పేజీ తరువాయి)

బుధవారం దిల్లీలో డాక్టర్.అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ యాప్‌ను జాతికి అంకితం చేశారు. 2009లో ఇదే రోజున అంటే జనవరి 28న ఆధార్‌ను లాంచ్ చేశారు. ఈ యాప్ ద్వారా వెంటనే ఆధార్ వెరిఫికేషన్ చేసు కోవచ్చు. చిరునామా, మొబైల్‌నంబర్‌ను అప్‌డేట్ చేసుకునే సౌలభ్యం ఉంది. ఆధార్ కాంటాక్ట్ కార్డ్ ద్వారా అత్యంత గోప్యంగా కాంటాక్ట్ వివరాలను పంచుకోవచ్చు. ఎవరికైనా షేర్ చేసినప్పుడు మొత్తం వివరాలు కాకుండా అవసరమైనవి మాత్రమే కనిపించేలా ఏర్పాటు చేసుకోవచ్చు. ఎలాంటి సంక్లిష్టత లేకుండా యూజర్లకు అందుబాటులోకి సేవలు ఈ యాప్ ద్వారా ఐదుగురి వరకు ప్రొ÷ల్ వివరాలు క్రియేట్ చేసుకోవచ్చు.

## బోధనలో నాణ్యత పెరగాలి

(మొదటి పేజీ తరువాయి)

సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాఠశాల విద్య, ఉన్నత విద్య, డిజిటల్ విద్య, ఇంటర్మీడియట్, డిగ్రీ కాలేజీల్లో పనితీరు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం, తదితర అంశాలపై సమీక్ష చేశారు. ఉన్నత విద్యా సంస్థలు, కళాశాలలో, విశ్వవిద్యాలయాలలో బోధన చేసి రిటైర్డ్ అయిన మంచి అనుభవం కలిగిన ప్రోఫెసర్స్, లెక్చరర్స్, టీచర్స్ తో విద్యార్థులకు తరుచుగా మూఖాముఖి కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు బోధన చేయిస్తే విద్యార్థులలో సృజనాత్మకత, మోటీవేషన్, మంచి ఆలోచనలు పెరిగే అవకాశం ఉంటుందని అన్నారు. తద్వారా విద్యార్థుల భవిష్యత్ కు సంబంధించి ప్రణాళికలు ఏర్పరచుకొనే అవకాశం ఉంటుందని అన్నారు. అదే విధంగా కేజీబివి, వివిధ సంక్షేమ వసతి గృహాలలో ఒక వసతి గృహాన్ని ఎంపిక చేసుకొని అందులో సోలార్ మోడల్ తరహా కిచెన్, స్టోరేజ్ రూమ్స్, మౌలిక వసతులు, త్రాగునీరు, టాయిలెట్స్, విద్యుత్, ఇంటర్నెట్ అన్ని సదుపాయాలు ఏర్పాటు చేసి దానిని ఒక మోడల్ హాస్టల్ గా రూపొందించాలని సి.ఎస్ అధికారులకు సూచించారు. దానిని ఆద ర్శంగా తీసుకోని భవిష్యత్‌లో మిగితా వసతి గృహాలలో కూడా ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. కళాశాలల స్థాయిలో కెరీర్ గైడెన్స్ తరగతులు నిర్వహించాలని, ః.ఇట కోర్స్ పూర్తి చేసిన విద్యార్థులతో ఇంటర్న్‌షిప్ కార్యక్రమం క్రింద ప్రభుత్వ పాఠశాలలో బోధన చేయించాలని, విద్యార్థులలో ఆసక్తి, నైపుణ్యాలు పెంచే విధంగా అనుభవం కలిగిన రిటైర్డ్ ఉపాధ్యాయులు, మార్గదర్శకులతో తరగతులు నిర్వహిస్తే విద్యార్థులకు మంచి ప్రయోజనం కలుగుతుందని అన్నారు. సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా, ఉన్నత విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య, ఐటి ప్రత్యేక కార్యదర్శి భవేష్ మిశ్రా , పాఠశాల విద్యా సంచాలకులు నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు.

## సుప్రీం ఆదేశాలతో అనర్హతపై స్పీకర్ విచారణ

(మొదటి పేజీ తరువాయి)

బీఆర్ఎస్ ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ జరగనుండగా.. మధ్యాహ్నం 12:00 గంటలకు బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ జరగనుంది. ఎమ్మెల్యేల అనర్హత అంశంలో జాప్యం జరుగుతోందని భావించిన సుప్రీంకోర్టు ఈ నెల 19న స్పీకర్‌కు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. చర్యలు తీసుకోకపోతే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించిన నేపథ్యంలో, స్పీకర్ పెండింగ్‌లో ఉన్న ముగ్గురు ఎమ్మెల్యేలుదానం నాగేందర్, కడియం శ్రీహరి, డాక్టర్ సంజయ్ అంశాన్ని పరిశీలిస్తున్నారు. ఇప్పటికే అరికపూడి గాంధీ సహా మరో ఏడుగురికి 'క్లీన్ చిట్' లభించిన సంగతి తెలిసిందే. అయితే మిగిలిన ఎమ్మెల్యేలతో పోలిస్తే దానం నాగేందర్ కేసు భిన్నమైనది. ఆయన బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉంటూనే 2024 పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ బి-ఫామ్‌పై ఎంపీగా పోటీ చేశారు. ఇది స్పష్టమైన ఫిరాయింపు కిందకు వస్తుందని.. అందుకే ఆయనపై అనర్హత వేటు పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని సమాచారం. ఒకవేళ స్పీకర్ అనర్హత వేటు వేస్తే, దానం తన ఎమ్మెల్యే పదవిని కోల్పోతారు. మరోవైపు స్పీకర్ నిర్ణయం తీసుకోకముందే.. దానం నాగేందర్ తన పదవికి రాజీనామా చేసి ఉప ఎన్నికలకు వెళ్తారనే ప్రచారం కూడా గట్టిగా సాగుతోంది. మొత్తానికి 30వ తేదీన జరిగే విచారణ తెలంగాణ రాజకీయాల్లో పెను మార్పులకు దారితీసేలా కనిపిస్తోంది.

## రన్‌వే గుర్తింపులో పైలట్లు ఇబ్బంది

(మొదటి పేజీ తరువాయి)

'పైలట్ల నుంచి మేడే కాల్ రాలేదు. రన్‌వే గుర్తింపులో పైలట్లు ఇబ్బంది పడ్డారు. తొలి ప్రయత్నంలో రన్‌వే కనిపించకపోవడంతో.. కాసేపు విమానం గాల్లో చక్కర్లు కొట్టింది. రెండోసారి ల్యాండ్ అయ్యేందుకు యత్నించి విఫలమయ్యారు. కొద్దిసేపటి తర్వాత, రన్‌వే-11 ప్రవేశద్వారం దగ్గర మంటలు కనిపించాయి. రన్‌వే ఎడమ వైపున ప్రవేశద్వారం దగ్గర విమాన శిథిలాలు కనిపించాయి' అని డీజీసీఏ వెల్లడించింది. ఆపదలో ఉన్నప్పుడు పైలట్ల నుంచి మేడే కాల్ అనేది వస్తుంది. ఇక ఈ ఘటనపై కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు స్పందించారు. ప్రాథమిక దర్యాప్తులో వెలుతురు సమస్యే కారణమని వెల్లడైనట్లు ఆయన తెలిపారు. విమాన ప్రమాదంపై పూర్తిస్థాయి విచారణకు ఆదేశించామని రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. ఇక ఘటన విషయానికి వస్తే.. పవార్‌తో పాటు, ఆయన వ్యక్తిగత భద్రతా అధికారి విదీప్ జాదవ్, ఇద్దరు పైలట్లు.. సుమిత్ కపూర్, శాంభవి పాఠక్, ఒక్క పైలట్ అటెండెంట్ ఈ ప్రమాదంలో మరణించారు.

## రన్‌వేపై విజిబిలిటీ తక్కువతోనే ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

అని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ అధికారులు పైలట్లను ప్రశ్నించారని, రన్‌వే కనిపించడం లేదని వారు సమాధానం ఇచ్చినట్లు వెల్లడించారు. దీంతో భద్రతా కారణాల దృష్ట్యా విమానం కొంతసేపు గాల్లోనే చక్కర్లు కొట్టినట్లు ఆయన చెప్పారు. అనంతరం రెండోసారి ల్యాండింగ్‌కు ప్రయత్నించే సమయంలో మళ్లీ రన్‌వే కనిపిస్తుందా అని ఏటీసీ ప్రశ్నించగా, పైలట్లు సానుకూలంగా సమాధానం ఇచ్చారని, దాంతో ల్యాండింగ్‌కు అనుమతి ఇవ్వగా, ఆ క్షణాల్లోనే విమానం ప్రమాదానికి గురైందని తెలిపారు. ఈ ఘటనపై అన్ని కోణాల్లో లోతైన విచారణ చేపడతామని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. పూర్తి వివరాలు సేకరించిన తర్వాత వాస్తవాలను ప్రజల ముందుంచుతామని తెలిపారు. ఇప్పటికే డీజీసీఏతో పాటు ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరోకి చెందిన ప్రత్యేక బృందాలు పుణెకు చేరుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు వెల్లడించారు. ఇదే అంశంపై డీజీసీఏ వర్గాలు కూడా స్పందించాయి. ల్యాండింగ్ సమయంలో రన్‌వేను స్పష్టంగా గుర్తించడంలో పైలట్లకు ఇబ్బందులు ఎదురైనట్లు తెలిపాయి. అయితే అత్యవసర పరిస్థితిని సూచించే మేడే కాల్స్ పైలట్ల నుంచి అందలేదని అధికారులు పేర్కొన్నట్లు సమాచారం. ఈ ఘటనపై మరిన్ని వివరాలు వెలుగులోకి రావాల్సి ఉందని, దర్యాప్తు పూర్తయ్యాకే ప్రమాదానికి గల అసలు కారణాలు తెలుతాయని అధికారులు చెబుతున్నారు.

## మాహారాష్ట్ర రాజకీయాల్లో తీరని విషాదం

(మొదటి పేజీ తరువాయి)

చెలరేగాయి. ఈ ఘటనలో విమానం రెండు ముక్కలైంది. అందులోని వారంత కాలి బూడిదయ్యారు. అజిత్ పవార్.. బారామతిలో బహిరంగ సభకు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్టు సమాచారం. ఘటనాస్థలిలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. కూలిపోయి అగ్నికి ఆహుతైన విమానంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ తోపాటు, మరో ఇద్దరు సిబ్బంది ఒక పీఎస్ఓ, ఒక సహాయకుడు మరో ఇద్దరు పైలట్, కో-పైలట్ మొత్తం ఐదుగురు ఉన్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, విమానంలో ఉన్న ఏ ఒక్కరూ ఈ ప్రమాదం నుండి



ప్రాణాలతో బయటపడలేదని డీజీసీఏ అధికారికంగా ప్రకటించింది. అజిత్ పవార్ నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ అజిత్ పవార్ వర్గం అధ్యక్షులు. మహారాష్ట్రలో అత్యధిక కాలం ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన నాయకుడు. 2024 డిసెంబరు 5 నుంచి దేవేంద్ర ఫడ్నవీస్ ముఖ్యమంత్రిగా ఉన్న మహాయుతి ప్రభుత్వంలో ఏక్‌నాథ్ షిండేతో కలిసి డిప్యూటీ సీఎంగా పనిచేస్తున్నారు. ప్రమాదం వార్త తెలిసిన వెంటనే ఘటనా స్థలానికి రక్షణ సిబ్బంది, పోలీసులు, ఫైర్ సర్వీస్ బృందాలు చేరుకున్నాయి. డిప్యూటీ సీఎం విమాన ప్రమాదంలో చనిపోయారన్న వార్త తెలిసి ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, మరో ఉపముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, ఇతర నాయకులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ప్రభుత్వం, ప్రతిపక్షాలు ఈ దుర్ఘటనపై తీవ్ర ఆవేదన, దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నాయి. ప్రజలు పెద్ద ఎత్తున ఘటనాస్థలానికి చేరుకున్నారు. బారామతి నియోజకవర్గం నుంచి బలమైన బేస్ ఉన్న అజిత్ పవార్.. శరద్ పవార్ అన్నయ్య కుమారుడు. రాజకీయంగా చాలా శక్తిమంతమైన వ్యక్తిగా ఎదిగారు. ఆయన మరణంతో మహారాష్ట్ర రాజకీయాల్లో భారీ లోటు ఏర్పడిందని పలువురు రాజకీయ ప్రముఖులు చెబుతున్నారు. పవార్ మృతితో మహాయుతి కూటమి, బారామతి ప్రాంతీయ రాజకీయాలపై తీవ్ర ప్రభావం పడనుంది.

## వికసిత్ భారత్ వైపు దేశం పయనిస్తోంది

(మొదటి పేజీ తరువాయి)

'పదేళ్లలో 25కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకొచ్చాం. సామాజిక న్యాయం ప్రాతిపదికన కేంద్రం పని చేస్తోందన్నారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల తొలి రోజైన బుధవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉభయసభల్ని ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ప్రసంగిస్తూ... వందేభారత్, అమృత్ భారత్ రైళ్ల ద్వారా సేవలు విస్తరించాం. ప్రతి పౌరుడికి జీవిత బీమా కల్పించడం ప్రభుత్వ లక్ష్యం. ఆయుష్మాన్ భారత్‌తో కోట్లమందికి వైద్యసేవలందిస్తున్నాం. వరి ఉత్పత్తిలో ప్రపంచంలోనే భారత్ నెం1 స్థానంలో నిలిచింది. అక్వా, పాల ఉత్పత్తుల్లో భారత్ ముందంజలో ఉందని రాష్ట్రపతి వెల్లడించారు. దేశంలో స్పేస్ టూరిజం అభివృద్ధికి ఎన్నో అవకాశాలున్నాయని రాష్ట్రపతి అన్నారు. భవిష్యత్‌లో అంతరిక్షంలో భారత స్పేస్ స్టేషన్ ఏర్పాటు చేస్తామని, జమ్మూకశ్మీర్‌లో అత్యంత ఎత్తైన రైల్వే బ్రిడ్జి నిర్మించామని గుర్తు చేశారు. గత 11 ఏళ్లలో భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందిందని రాష్ట్రపతి చెప్పారు. అవినీతి కట్టడితో ప్రభుత్వ ప్రజాధనాన్ని సద్వినియోగం చేస్తోంది. జీఎస్‌టి స్లాబ్‌ల తగ్గింపుతో దేశ ప్రజల కొనుగోలు శక్తి పెరిగింది. యూరోపియన్ యూనియన్‌తో ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ చేసుకున్నాం. రూ.12లక్షల వార్షిక ఆదాయం వరకు ఆదాయపు పన్ను లేకుండా చేశాం. స్మార్ట్‌ఫోన్ల ఎగుమతుల్లోనూ భారత్ దూసుకెళ్తోంది. భారత్ పవర్ టెక్నాలజీ హబ్‌గా రూపొందుతోంది. గ్రీన్ ఎనర్జీ రంగంలో భారత్‌ను పవర్ హౌస్‌గా తయారు చేస్తున్నాం. భవిష్యత్‌లో 100 గిగావాట్ల న్యూక్లియర్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యం. 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి చర్యలు. వికసిత్ భారత్‌లో రైతుకు అధిక ప్రాధాన్యత ఉంటుందని రాష్ట్రపతి స్పష్టం చేశారు. గ్రామీణ ఉపాధి కల్పన కోసం జీ రామ్ జీ చట్టం తీసుకొచ్చాం. దేశాభివృద్ధిలో మహిళలకు కీలక పాత్ర కల్పించాం. ఆపరేషన్ సిందూర్.. మన సైనికుల సత్తా చాటింది. భారత్‌పై దాడిచేస్తే ఏం జరుగుతుందో ప్రపంచం చూసింది. రక్షణరంగ ఉత్పత్తుల ఎగుమతి రికార్డు స్థాయిలో పెరిగింది. ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్ డిఫెన్స్ ఉత్పత్తులకు గిరాకీ పెరిగింది. నానో చిప్‌ల తయారీపైనా భారత్ దృష్టి సారించింది. మైక్రో చిప్‌ల తయారీలో స్వయంసమృద్ధి సాధించాలి. ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలో 15లక్షల ఉద్యోగాలు సృష్టించగలిగాం. ముద్ర యోజన ద్వారా చిరువ్యాపారులకు భారీగా రుణాలు అందించాం. వంటి ఎన్నో ప్రభుత్వ కార్యక్రమాల్ని రాష్ట్రపతి తన ప్రసంగంలో వెల్లడించారు. పీఎం విశ్వకర్మ యోజనతో 20లక్షల మందికి శిక్షణ ఇస్తున్నామని రాష్ట్రపతి తెలిపారు. ఎన్డీఏ పదేళ్ల పాలనలో 25 కోట్ల మందికి పేదరికం నుంచి విముక్తి కల్పించినట్లు తెలిపారు. 100 కోట్లకు పైగా గ్యాస్ కనెక్షన్లు అందించామని.. ఆయుష్మాన్ భారత్ ద్వారా కోట్ల మందికి వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. వికసిత్ భారత్‌లో రైతులకు ప్రథమ ప్రాధాన్యం ఇచ్చామన్నారు. వ్యవసాయ మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నట్లు పేర్కొన్నారు. ఆత్మనిర్భర్ భారత్ సాధన కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్రపతి పేర్కొన్నారు. భవిష్యత్తును దృష్టిలోపెటు ్టకొని దేశం సంస్కరణల పథంలో దూసుకెళ్తోందన్నారు. పీఎల్ఐ పథకం కింద పారిశ్రామికోత్పత్తిని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల్లో గణనీయమైన ప్రగతి సాధించామన్నారు. సముద్ర వ్యాపారాన్ని మరింత పెంచేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు వెల్లడించారు. అంతకుముందు పార్లమెంట్‌కు చేరిన రాష్ట్రపతికి స్పీకర్ ఓం బిర్లా, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, ప్రధాని మోడీ తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. ఆమెను సాదరంగా పార్లమెంట్ భవనంలోకి తోడ్కొని వెళ్లారు.

## దేశానికే రోల్‌మోడల్‌గా డిజాస్టర్ మేనేజిమెంట్

(మొదటి పేజీ తరువాయి)

కొనుగోలు చేయాలన్న విషయంపై సుదీర్ఘంగా చర్చించారు. వరదలు, అగ్నిప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితుల్లో త్వరిత గతిన స్పందించడానికి ఖచ్చితమైన సమాచార వ్యవస్థ, రియల్ టైమ్ మానిటరింగ్ సాధ్యమయ్యేలా విపత్తు ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, డ్రోన్లు, శాటిలైట్ ఆధారిత కమ్యూనికేషన్, ఆధునిక రెస్క్యూ పరికరాలు, అత్యాధునిక్గర్ / సెర్చ్ ఆపరేషన్ల సాంకేతికతను రెవెన్యూ-విపత్తు నిర్వహణ విభాగాలకు అందుబాటులోకి తెస్తామని మంత్రి వెల్లడించారు.

విపత్తు విభాగంలో పనిచేసేవారికి శిక్షణ ఇవ్వడానికి రాష్ట్ర స్థాయిలో డిజాస్టర్ మేనేజిమెంట్ ఆధ్వర్యంలో అత్యుత్తమ శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే వాతావరణ పరిస్థితులు క్షేత్రస్థాయి వరకు ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేసేలా ఆయా స్థానిక పరిస్థితులను బట్టి మండల స్థాయి వరకు అడ్వాన్సుడ్ వెదర్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. భారీ వర్షాలు వరదల సమయంలో వాగుల్లో వంకల్లో చెరువుల్లో చిక్కుకున్నవారిని రక్షించడానికి ఎయిర్‌లిఫ్ట్ మెకానిజం తయారు చేసుకోవాలని ప్రమాదాల్లో చిక్కుకున్న వారిని తరలించడానికి 70 నుంచి 80 కిలోల బరువును ఎత్తే డ్రోన్లను కొనుగోలు చేయాలని సూచించారు. ఎయిర్ లిఫ్ట్ వ్యవస్థ సరిగాలేకపోవడం వల్ల 2024 సంవత్సరంలో నా పాలేరు నియోజకవర్గంలో వాగుల్లో చిక్కుకున్న బాధితులను రక్షించుకోలేక పోయానని ఈ సందర్భంగా మంత్రిగారు ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి రాష్ట్రంలో ఏ మారుమూల ప్రాంతంలోనైనా మాట్లాడడానికి వీలుగా సిమ్ ఆధారిత విహెచ్ ఎఫ్ రేడియో సిస్టమ్స్ అందుబాటులోకి తేవాలని సూచించారు. ఇప్పటికే ఈ వ్యవస్థ అందుబాటులో ఉంది. వ్యవస్‌టను క్షేత్రస్థాయి వరకు తీసుకువెళ్లాలని సూచించారు. అలాగే హైదరాబాద్ నగరంలో హైరైజ్డ్ భవనాలలో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు వాటిని సమర్ధవంతంగా ఎదుర్కొనేలా అవసరమైన పరికరాలను కొనుగోలు చేయాలని హైడ్రా కమిషనర్‌కు సూచించారు. 77 హైస్పీడ్ బోట్‌లను కొనుగోలు చేయాలని సూచించారు. రాష్ట్రంలో 12 ఎస్డీఆర్ఎఫ్ బృందాలు ఉన్నాయని, ఒక్కో బృందంలో వెయ్యిమంది వరకు ఉన్నారని వీరందరికీ ఎప్పటి కప్పుడు శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్, అగ్నిమాపకశాఖ డైరెక్టర్ విక్రమాన్ సింగ్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఐసిసిసిడైరెక్టర్ కమల్‌హాసన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేను బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయలేదు

(మొదటి పేజీ తరువాయి)

**తనకు అందలేదని స్పష్టం చేశారు. మార్చి 2024లో జరిగిన కాంగ్రెస్ సమావేశానికి హాజరైన విషయాన్ని అంగీకరించినప్పటికీ, అది పూర్తిగా వ్యక్తిగత హోదాలో జరిగినదేనని చెప్పారు. ఒక పార్టీ సమావేశానికి వ్యక్తిగతంగా హాజరవడమే ఫిరాయింపుగా పరిగణించడాన్ని ఆయన తప్పబట్టారు. మీడియా కథనాల ఆధారంగా తాను పార్టీ మారినట్లు బీఆర్ఎస్ భావించడం అనుచితమని, ఆ నిర్ధారణకు చట్టపరమైన ఆధారాలు లేవని చెప్పారు. అనర్హత పిటిషన్ రాజకీయ ప్రయోజనాల కోసం దాఖలు చేయబడిందని వాదించిన దానం నాగేందర్, పిటిషన్‌లో బలం లేదని, అందువల్ల దానిని కొట్టి వేయాలని స్పీకర్ కోర్టును కోరుతూ తన అఫిడవిట్‌ను ముగించారు.**

## కరీంనగర్ కార్పొరేషన్‌లో కాంగ్రెస్ జెండా ఎగరాలి

(మొదటి పేజీ తరువాయి)

కరీంనగర్ డీసీసీ ఆఫీసులో మున్సిపల్ ఎన్నికల్లో పోటీకి ఆశావహులతో జరిగిన సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు పొన్నం ప్రభాకర్. ప్రజా పాలన ప్రభుత్వం లో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో గ్రామాల వలె పట్టణాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక తో ముందుకు పోతున్నామని అన్నారు. ఇప్పటికే పట్టణాల్లో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని రాష్ట్రంలో ఎక్కడికెళ్లినా ప్రజా పాలనపై ప్రజలు పాజిటివ్ గా ఉన్నారని.. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజల్లో వివరిస్తూ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించామని.. ఇప్పటి వరకు ప్రభుత్వం ఆర్టీసీకి 9 వేల కోట్లు చెల్లించిందని అన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్,సన్న బియ్యం పంపిణీ,నూతన రేషన్ కార్డులు పంపిణీ, రైతులకు రైతు భరోసా, రైతు రుణమాఫీ,ఉద్యోగాల నియామకాలు , సన్న వడ్లు బోనస్, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, నియోజకవర్గనికి 3, 500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు, లాంటి ఎన్నో పథకాలు అమలు చేస్తుందని అన్నారు. పోటీ చేసే ఆశావహులు వార్డుల్లో తిరుగుతూ బలోపేతం చేయాలని..టికెట్ ఎవరికి వచ్చినా..అందరూ కలిసి సమన్వయం చేసుకుంటూ గెలవాలని అన్నారు.

# 12వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థిగా అప్పం శ్రీనివాస్ నామినేషన్



**ఆమనగల్లు, జనవరి 28 (అక్షర గళం):** ఆమనగల్లు మున్సిపాలిటీ 12వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థిగా అప్పం శ్రీనివాస్ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. పారదర్శక పాలన, వార్డు అభివృద్ధి తన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అప్పం శ్రీనివాస్ కు తమ మద్దతు ప్రకటించారు.




తెలుగు దినపత్రిక https://aksharagalam.com

అక్షరగళం

ప్రతి అక్షరం ప్రజల కోసం

తెలంగాణ రౌండప్





# శాంతియుత ఎన్నికలే మా లక్ష్యం..

◆ ఏసిపి జానకిరెడ్డి ◆ మున్సిపల్ ఎన్నికలకు పటిష్ఠ బందోబస్తు

**ఆమనగల్లు, జనవరి 28 (అక్షర గళం):** ఆమనగల్లు మున్సిపాలిటీలోఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని బుధవారం మహేశ్వరం ఏసిపి జానకిరెడ్డి సందర్శించారు. మున్సిపాలిటీ వద్ద కౌంటర్లు, బారికేడ్లు, పార్కింగ్ వసతులను స్వయంగా తనిఖీ చేశారు. నామినేషన్ కేంద్రాల వద్ద భద్రతా చర్యలపై మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ తో చర్చించారు. ఈ సందర్భంగా ఏసిపి జానకిరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికలు అత్యంత శాంతియుత వాతావరణంలో జరిగేలా పోలీస్ శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా అధికారులకు పలు సూచనలు చేశారు. అభ్యర్థులకు ఇబ్బంది లేకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. పటిష్ఠ భద్రత మధ్య పారదర్శకంగా నామినేషన్లు స్వీకరించాలని తెలిపారు. ఎన్నికల నియమావళి ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాల న్నారు. ఆయన వెంట సీఐ జానకి రామ్ రెడ్డి, ఎస్ఐ వెంకటేష్ మరియు పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



# బీఆర్ఎస్ అభ్యర్థుల నామినేషన్ దాఖలు

**ఆమనగల్లు, జనవరి 28 (అక్షర గళం):** ఆమనగల్లు మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా మున్సిపాలిటీలో ఆయా వార్డులకు పోటీ చేయనున్న బీఆర్ఎస్ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థులు మొదటి రోజు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా ఆధ్వర్యంలో రిటర్నింగ్ అధికారులకు తమ నామినేషన్ లను దాఖలు చేశారు. ఆమనగల్లు మున్సిపాలిటీలోని 6వ వార్డుకు బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు పత్యనాయక్, 8వ వార్డుకు యూత్ వింగ్ ప్రధాన కార్యదర్శి ఎనుమల్ల రమేష్, 4వ వార్డుకు అడ్వకేట్ దుడ్డు ఆంజనేయులు యాదవ్, 10వ వార్డుకు మంచుకొండ పద్మ నామినేషన్ దాఖలు చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గుత్తి బాలస్వామి, మాజీ కౌన్సిలర్ కమటం రాధమ్మ వెంకటయ్య, రాములు యాదవ్, శేఖర్ రెడ్డి, బాలకృష్ణ, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమేష్, చలి చీమల సతీష్, కృష్ణ యాదవ్, వరకుప్పల గణేష్, మహేష్ నేత, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# డ్రంక్ అండ్ డ్రై కేసులో ఒకరికి జైలు శిక్ష జరిమానా..

**- కల్వకుర్తి ఎస్ఐ మాధవరెడ్డి**


**కల్వకుర్తి, జనవరి 28(అక్షరగళం):** మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన తాడూరు మండలం సిరిస వాడకు చెందిన పూస బన్నీ ని బుధవారం కోర్టులో హాజరు పరచగా ఒకరోజు జైలు శిక్షతో పాటు 600/- జరిమానా ను జూనియర్ సివిల్ జడ్జ్ కావ్య జాడ విధించినట్లు కల్వకుర్తి ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే ఊచలు లెక్క పెట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

# గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తుల అరెస్టు...

- పట్టుబడిన గంజాయి విలువ 58,850... రెండు సెల్ ఫోన్లు స్వాధీనం!
- కల్వకుర్తి సీఐ బి.నాగార్జున..



**కల్వకుర్తి, జనవరి 28(అక్షరగళం):** నాగర్ కర్నూలు జిల్లాలో మాదక ద్రవ్యాల నిరోధానికి పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ ఆదేశాల మేరకు పనిచేస్తున్నామని కల్వకుర్తి సీఐ బోయ నాగార్జున అన్నారు. బుధవారం కల్వకుర్తి రెవెన్యూ డివిజన్ ఊరుకొండ మండలంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరినీ అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు సీఐ తెలిపారు.కల్వకుర్తి రెవెన్యూ డివిజన్ సర్కిల్ పరిధిలోని ఊరుకొండ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వివరాలను ఊరుకొండ ఎస్ఐ కృష్ణదేవతో కలిసి వివరాలను వెల్లడించారు. ఈ నెల 27న సాయంత్రం 4:00 గంటల సమయంలో ఊరుకొండ పేట గ్రామ శివారులో కోదాడ జడ్చర్ల జాతీయ రహదారి రోడ్డు సమీపంలోని పక్కన ఉన్న సూర్యలత స్పిన్నింగ్ మిల్ సమీపంలో చెట్ల పొదల్లో ఇద్దరు వ్యక్తులు ఎరుపు నలుపు టీ-షర్టులు ధరించి ఒక బ్యాగు చేతిలో ఉండి అనుమానస్పదంగా తిరుగుతున్నారని పక్కా సమాచారంతో ఊరుకొండ ఎస్ఐ కు సమాచారం అందుకున్న ఎస్ఐ కల్వకుర్తి సీఐ బి.నాగార్జునకు సమాచారం ఇవ్వగా పోలీస్ సిబ్బందితో ఉటావుటిన చేరుకున్న సిఐ ఎస్ఐ లు సూర్యలత స్పిన్నింగ్ మిల్లు పక్కన ఉన్న చెట్ల పొదల్లో అనుమానాస్పదంగా ఇద్దరి వ్యక్తులు తిరుగుతుండడంతో వారిని పట్టుకొని వారిని పట్టుకోవడానికి వెళ్తున్న క్రమంలో పోలీస్ వారిని చూసి పారిపోవడానికి ప్రయత్నిస్తుండగా ఊరుకొండ ఎస్ఐ తన సిబ్బందితో వారిని పట్టుకొని విచారించగా పేర్లను వెల్లడించారని ఒడిస్సా రాష్ట్రానికి చెందిన లిట్టు మాలిక్ సూర్యలతా స్పిన్నింగ్ మిషన్ ఆపరేటర్ గా మరొకరు అభిమన్యు మాలిక్ స్పిన్నింగ్ మిషన్ ఆపరేటర్లుగా పనిచేస్తున్నారని ఒడిస్సా రాష్ట్రం నుండి గంజాయి తక్కువ రేట్ కు దొరుకుతుందని ఇక్కడ గంజాయి డిమాండ్ ఉండడంతో గంజాయిని తీసుకొచ్చి అమ్ముకొని లాభాలు సంపాదించుకోవాలన్నా ఉద్దేశంతో ఇద్దరం కలిసి బిజినెస్ ప్రారంభించారని ఈనెల 15వ తేదీన అభిమన్యు మాలిక్ తన సొంత గ్రామానికి పోతుండగా లిట్టు మాలిక్ 20000 ఇచ్చి గంజాయి తీసుకు రమ్మని కోరగా అభిమన్యు మాలిక్ ఈనెల 23న ఒడిస్సా నుండి గంజాయి కొనుగోలు చేసి ఎవరికి అనుమానం రాకుండా బస్సులో హైదరాబాద్ నుండి హైదరాబాద్ కి వచ్చి అక్కడనుండి స్పిన్నింగ్ మిల్ దగ్గరికి చేరుకున్నాక లిట్టు కు ఫోన్ చేయడంతో ఇద్దరు కలిసి మిల్లు పరిసరాల ప్రాంతంలో ఉన్న చెట్ల పొదల్లో గంజాయి బ్యాగును దాచిపెట్టి సమయం దొరికినప్పుడల్లా గంజాయి అవసరమైన వారికి అధిక లాభాలకు అమ్ముకునేవారని సిఐ తెలిపారు. ఈనెల 27న సాయంత్రం గంజాయి విక్రయించడానికి బయటికి రావడంతో సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి పట్టుకోవడంతో తర్వాత విచారించగా 2:30 కిలోల (2.39ఎణబ)మొగ్గల పువ్వులతో కూడుకున్న గంజాయి పట్టుబడిందని దాని విలువ 59,850 రూపాయలు ఉంటుందని వారి నుండి రెండు సెల్ ఫోన్లు స్వాధీనపరచుకొని ఇద్దరినీ రిమాండ్ కు తరలించినట్లు సిఐ నాగార్జున వివరాలను వెల్లడించారు చాకచక్యంగా వ్యవహరించి దాడులు నిర్వహించిన ఊరుకొండ ఎస్ఐ కృష్ణ దేవను పోలీస్ కానిస్టేబుళ్లు హర్ష తిరుపతయ్య వెంకన్న లను జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ అభినందించినట్లు సీఐ బి.నాగార్జున తెలిపారు.







# తొలిరోజు మొదలైన నామినేషన్ల పర్వం

◆ 14 మంది నామినేషన్‌ల దాఖలు.. ◆ మున్సిపల్ కమిషనర్ మొహమ్మద్ షేక్

**కల్వకుర్తి, జనవరి 28(అక్షరగళం):** కల్వకుర్తి మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్‌లుగా పోటీ చేసేందుకు ఆయా పార్టీలకు చెందిన 14మంది నామినేషన్లను బుధవారం కల్వకుర్తి మున్సిపల్ కార్యాలయంలో తమ నామినేషన్లను దాఖలు చేశారు. కాంగ్రెస్ నుండి ఏడుగురు బిజెపి నుండి 5 మంది మొత్తం 14మంది నామినేషన్లను దాఖలు చేయగా అధికారులు నామినేషన్లను స్వీకరించారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి వార్డుల వారిగా నామినేషన్ల క్లస్టర్లను ఏర్పాటు చేశామని కల్వకుర్తి 22 వార్డులు ఉండగా 23 క్లస్టర్లు ఏర్పాటు చేసి ఒక్కొక్క క్లస్టర్లో మూడు వార్డులకు సంబంధించిన నామినేషన్ల పత్రాలను 10:30నుండి సాయంత్రం 5:00 గంటల వరకు స్వీకరించినట్లు మున్సిపల్ కమిషనర్ మొహమ్మద్ షేక్ తెలిపారు.








అదేవిధంగా 8 మంది రిటర్నింగ్ అధికారులతో పాటు మరో ఎనిమిది మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల 30వరకునామినేషన్ల స్వీకరణ ఉంటుందని అన్నారు. మున్సిపాలిటీ నామినేషన్ స్వీకరణ సమయంలో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా హెల్ప్ డెస్క్ ఉంటుందని అన్నారు.

మున్సిపల్ నామినేషన్లను కల్వకుర్తి ఆర్డీవో కల్వకుర్తి సిఐ నాగార్జున పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో పోలీస్ పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు.

# యువత స్వయం ఉపాధితో రాణించాలి

**ఆమనగల్లు, జనవరి 28 (అక్షర గళం):** యువత స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకుని ఆర్థికంగా ఎదగాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తెల్గమల్ల జగన్ పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య సూచించారు. ఆమనగల్లు పట్టణ కేంద్రంలో మాజీ ఉప సర్పంచ్ మస్న కృష్ణయ్య కుమారుడు శ్రీనివాస్ దంపతులు నూతనంగా ఏర్పాటు చేసిన శ్లోక మ్యాచింగ్ సెంటర్ లేడీస్ ఎంపోరియం ను 7వ కంటెస్టెండ్ అభ్యర్థి కృష్ణ నాయక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువత ప్రభుత్వ ఉద్యోగాల కొరకు వేచి చూడకుండా అందుబాటులో ఉన్న స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకోవాలన్నారు.



స్థానికంగా వ్యాపార కేంద్రాలను ఆరంభించి ప్రజాసేవ చేస్తూ ఉపాధి పొందాలని సూచించారు. యువత స్వయం ఉపాధి అవకాశాలతో ఆర్థికంగా అభివృద్ధి చెందాల న్నారు. తాము ఉపాధి పొందడంతోపాటు మరో 10 మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు.

నాణ్యమైన సేవలతో వినియోగదారుల మన్ననలను పొందాలన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ అలీమ్, ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, మస్నా గిరి, అప్పి, నాజర్ తదితరులు పాల్గొన్నారు.

# అజిత్ దాదా పవార్ మరణ వార్త బాధాకరం



**- తల్లోజు ఆచారి**

**ఆమనగల్లు, జనవరి 28 (అక్షర గళం):** అజిత్ దాదా పవార్ మరణ వార్త ఎంతో బాధించిందని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి అన్నారు. బుధవారం ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. ధైర్యవంతుడు, నిష్కపటమైన నాయకుడు, మహారాష్ట్ర రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి అజిత్ దాదా పవార్ అని విమాన ప్రమాదంలో మరణించడంతో మహా రాష్ట్రలో విషాద ఛాయలు అలుముకున్నాయన్నారు. ఆయన ఆత్మకు శాశ్వత శాంతి చేకూరాలని ఆచారి పేర్కొన్నారు.




# 5వార్డు స్వతంత్ర అభ్యర్థిగా రవి

**ఆమనగల్లు, జనవరి 28 (అక్షర గళం):** ఆమనగల్లు మున్సిపాలిటీ 5వ వార్డు స్వతంత్ర అభ్యర్థిగా యువ నాయకుడు కోరే రవి బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల మున్సిపాలిటీ ఐదవ వార్డు అభివృద్ధి శూన్యమని ప్రజలు నాయకత్వ మార్పులు ఆశిస్తున్నారని, ఎన్నికలలో తన గెలుపు తథ్యమని ధీమా వ్యక్తంచేశారు. ఒక్కసారి అవకాశం ఇవ్వండి 5వ వార్డును మున్సిపాలిటీలోనే ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు.

# వెల్దండ రిక్రియేషన్ క్లబ్ నూతన అధ్యక్షులుగా ఎన్నికైన ఎన్నం శ్రీనివాస్ రెడ్డిని ఘనంగా సన్మానం

**వెల్దండ జనవరి 28 (అక్షర గళం):** వెల్దండ రిక్రియేషన్ క్లబ్ నూతన అధ్యక్షులుగా ఎన్నికైన ఎన్నం శ్రీనివాస్ రెడ్డి ను వెల్దండ గణేష్ యూత్ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా శాలువలతో సన్మానించి



శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా యూత్ నాయకులు మాట్లాడుతూ శ్రీనివాస్ రెడ్డి భవిష్యత్తులో మరెన్నో ఉన్నంత పదవులు స్వీకరించాలని వారు కోరారు అనంతరం ఎన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నన్ను సన్మానించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో యాదగిరి బడక రామకృష్ణ శ్రీనివాస్ రెడ్డి నవీన్ రెడ్డి అనిల్ కుమార్ శ్రీకాంత్ లోకేష్ పృధ్వీరాజ్ సాయిబాబు పుట్ట శివ కుమార్ మట్ట శివ గౌడ్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

# అంబేద్కర్ సంఘం అధ్యక్షుడిగా సిర్సనగండ్ల చెన్నయ్య ఏకగ్రీవ ఎన్నిక

**వెల్దండ జనవరి 28 (అక్షర గళం):** వెల్దండ మండల పరిధిలోని చొక్కనపల్లి గ్రామ అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడిగా సిర్సనగండ్ల చెన్నయ్య, ఉపాధ్యక్షులుగా తాండ్ర వంశీ,ప్రధాన కార్యదర్శిగా గోరటి రాజశేఖర్,కోశాధికారిగా తాండ్ర లక్ష్మణ్ లను గ్రామ యువకుల, సలహాదారుల సమక్షంలో



ఎన్నుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఈదులపల్లి శ్రీనివాసులు, జి. వెంకటయ్య, డి. జంగయ్య, కొమ్ము రమేష్,ఈదులపల్లి మల్లయ్య సార్,ఈదులపల్లి లక్ష్మణ్ ప్రకాష్, మరియు గ్రామ యువకులకు సమక్షంలో నూతన కమిటీని ప్రకటించారు. నూతనంగా ఎన్నికైన సభ్యులు యువకులకు గ్రామస్తులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అంబేద్కర్ యువజన సంఘం కార్యవర్గాన్ని పలువురు యువకులు, గ్రామస్తులు శాలువాలతో సన్మానించి సత్కరించారు.

# అదుపుతప్పి మెట్రో పిల్లర్‌ను ఢీకొన్న కారు

**ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థుల మృతి**

**హైదరాబాద్:** హైదరాబాద్ శివారులోని మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రయాణిస్తున్న ఓ వాహనం అదుపుతప్పి మెట్రో పిల్లర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు విద్యార్థులు అక్కడికక్కడే మృతిచెందగా.. మరో ముగ్గురికి గాయాలయ్యారు. ఆ ముగ్గురు విద్యార్థుల పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. ఈ ఘటనపై స్థానికులు మేడిపల్లి పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.మేడిపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విద్యార్థుల కారు అత్యంత వేగంతో ప్రయాణిస్తోందని, డ్రైవర్ స్పీడ్‌ను కంట్రోల్ చేయలేకపోవడమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని తెలిపారు. దీంతో కారు అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న మెట్రో పిల్లర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు ముందుభాగం పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. వీరంతా ఒకే ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం. ప్రమాద సమయంలో డ్రైవర్ మద్యం సేవించి ఉన్నాడా, లేదా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. విద్యార్థుల మృతితో వారి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ఉండాలంటే వాహనదారులు, ముఖ్యంగా యువత సరైన జాగ్రత్తలు పాటించాలని మేడిపల్లి పోలీసులు సూచించారు.







# డీసీఎం కారు ఢీకొని యువకుడు మృతి

**వెల్దండ జనవరి 28 (అక్షర గళం):** వెల్దండ మండల పరిధిలోని నారాయణపూర్ గేట్ వద్ద హైదరాబాద్ శ్రీశైలం జాతీయ రహదారిపై డీసీఎం కారు ఢీకొని యువకుడు మృతి కల్వకుర్తి నుండి హైదరాబాద్ వైపు వెళుతున్న డీసీఎం ఆమన్ గల్ నుండి కల్వకుర్తి వైపు వస్తున్న కారు ఎదురెదురుగా ఢీ కొన్నాయి కారులో ప్రయాణిస్తున్న రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం చరికొండ గ్రామానికి చెందిన వల్లపు దాస్ వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందాడు.

సంఘటన స్థలానికి ఎస్సై కురుమూర్తి చేరుకొని మృత దేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన వెంకటేష్ తల్లి వల్లపు దాస్ అలివేల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కురుమూర్తి తెలిపారు.

# కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు బ్లాక్‌మెయిల్ చేయవద్దు

- **కొంతమంది పోలీసు అధికారులతో సర్కారుకు అప్రతిష్ఠ**
- **బీఆర్ఎస్‌లో మాదిరిగా ఓవరాక్షన్ చేయవద్దు**
- **సీఎంకు వ్యతిరేకంగా ఎవరూ పనిచేయడం లేదు**
- **అది వారి రొటీన్ మీటింగే**
- **ఏఐసీసీ నేత, మాజీ ఎంపి మధుయాష్కీ సంచలన వ్యాఖ్యలు**

**హైదరాబాద్:** బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలకు కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపి మధుయాష్కీ ఝలక్ ఇచ్చారు. అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లో చేరామనే బ్లాక్‌మెయిల్ మాటలు మాట్లాడవద్దని సున్నితంగా హెచ్చరించారు.

గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన నేతలు అభివృద్ధి కోసమే అంటూ బ్లాక్‌మెయిల్



చేయకుంటే మంచిదని మాజీ ఎంపీ మధుయాష్కీ హెచ్చరించారు. దానం నాగేందర్ అంశం స్పీకర్ పరిధిలో ఉందన్నారు.

కొంతమంది పోలీసు అధికారులు ప్రజా ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకు వస్తున్నారని, బీఆర్ఎస్ హయాంలో పోలీసులు కార్యకర్తల్లా పని చేశారని, ఇప్పుడు కూడా కొందరు పోలీసులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని విమర్శించారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నారు. పోలీసు అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించవద్దని మందలించారు. ముఖ్యమంత్రి, మంత్రులు కలిసికట్టుగా పని చేస్తున్నారని.. ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా ఉప ముఖ్య మంత్రి, మంత్రులు సమావేశమయ్యారనేది అబద్ధపు ప్రచారం. ప్రతిరోజు వాళ్లంతా టచ్‌లోనే ఉంటారని.. సింగరేణిలో అసలు బొగ్గే తవ్వలేదు. అవినీతి ఎక్కడ జరుగుతుందని అన్నారు. జీవన్ రెడ్డి పార్టీ మారాలనుకుంటే ఎప్పుడో మారేవారని, అలాంటి సీనియర్ నాయకులు పదవుల కోసం కాదని, పార్టీ కోసం పని చేస్తారని మధుయాష్కీ స్పష్టం చేశారు.

# ఒక్కొక్క బ్రెవరేజ్ దగ్గర 1 కోటి 80 లక్షలు వసూలు

- **మైక్రో బ్రెవరేజ్ దక్కించుకునేందుకు 110 అప్లికేషన్ లు**
- **అందులో 25 అప్లికేషన్ ల టెండర్లు ముఖ్యనేతకు, మంత్రికి**
- **ముఖ్యనేత కోటా కింద 21 టెండర్లు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు**
- **మిగిలిన 4 మంత్రి కోటా కింద కేటాయించారు**
- **అందులో ఒక కోటి 50 లక్షలు ముఖ్య నేతకు వెళ్తాయి**
- **మరో 30 లక్షలు తోడుగా ఉన్న వ్యక్తికి**
- **హోలోగ్రామ్ టెండర్ వ్యవహారంలో అల్లుడుకి కావాలని ముఖ్యనేత.. మంత్రి కుమారుడుకి కావాలని మంత్రి పంచాయతీ**
- **మీడియా చిట్‌చాట్‌లో ఎక్సైజ్ అవినీతిని బట్టబయలు చేసిన మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్‌రావు**

**హైదరాబాద్:** సింగరేణిలో బయటపెట్టాల్సిన ఇంకా కుంభ కోణాలు ఉన్నాయి .ఈ రోజు ఎక్సయిజ్ శాఖలో కుంభ కోణాన్ని బయట పెడుతున్నా.రాష్ట్ర ప్రభుత్వం ఎక్సైజ్ శాఖలో మరో కుంభకోణానికి తెరలేపింది. మైక్రో బ్రెవరేజ్ దక్కించుకునేందుకు 110 అప్లికేషన్‌లు వచ్చాయి. అందులో 25 అప్లికేషన్‌ల టెండర్లు ముఖ్యనేతకు, మంత్రికి ఇచ్చేందుకు సిద్ధమయ్యారు.

అందులో ముఖ్యనేత కోటా కింద 21 టెండర్లు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు.మిగిలిన 4 మంత్రి కోటా కింద కేటాయించారు. ఈ మధ్య ముఖ్య నేతకు నీడగా ఉండే వ్యక్తి వార్తల్లో నిలుస్తున్నారు. ముఖ్య నేతకు నీడగా ఉండే , ఆ నేత నేరుగా ముఖ్య నేత ఇంటికి వెళ్తారు. ఈ మధ్య ముఖ్యనేత తిరుపతికి పోయినప్పుడు నీడగా ఉన్నాడు.

ఒక్కొక్క బ్రెవరేజ్ దగ్గర అన్ అఫిషియల్ గా 1 కోటి 80



లక్షలు తీసుకునేలా ఒప్పందం.

అందులో ఒక కోటి 50 లక్షలు ముఖ్య నేతకు వెళ్తాయి, మరో 30 లక్షలు తోడుగా ఉన్న వ్యక్తికి వెళ్తాయి. వైన్స్ షాపుల లక్కీ డ్రా తియ్యకుండా , కొందరికి టెండర్ లు వచ్చాయి. రాష్ట్ర చరిత్రలో ఎప్పుడు లేని విధంగా లిక్కర్ సరఫరా చేసే సంస్థలకు 4 వేల 500 కోట్లు బకాయిలు పెండింగ్ లో పెట్టారు. 16 నెలల నుంచి సరఫరా చేసే కంపెనీలకు డబ్బులు చెల్లించడం లేదు. చరిత్రలో ఇది ఎప్పుడు జరగలేదు. దీని వల్ల బ్రీజర్ సరఫరా రాష్ట్రంలో ఆగిపోయింది. చాలా షాపుల్లో బ్రీజర్ సరఫరా ఆగిపోయింది.

మిగిలిన కొన్ని కంపెనీలకు డబ్బులు చెల్లించడం లేదు. మల్టీ నేషనల్ కంపెనీలు సరఫరా నిలిపివేస్తాము అని రాష్ట్ర ప్రభుత్వానికి అనేక సార్లు లేఖలు రాశారు. మంత్రుల మధ్య వాటాల పంచాయతీతో ఈ లాంటి పరిస్థితి వచ్చింది. దీని వల్ల రాష్ట్ర ఆదాయం దెబ్బతినే అవకాశం ఉంటుంది

హోలోగ్రామ్ టెండర్ వ్యవహారంలో అల్లుడుకి కావాలని ముఖ్యనేత, మంత్రి కుమారుడుకి కావాలని మంత్రి పంచాయతీలో ఎఐఎఎస్ అధికారి స్వచ్ఛంద విరమణకు దారి తీసింది. బీరు కంపెనీలకు ఇచ్చే ప్రాధాన్యత, రైతులకు ఇవ్వడం లేదు.

ఈ ప్రభుత్వానికి రైతులు అంటే చులకన.మెదక్ జిల్లా సింగూర్ డ్యాం కింద రైతులకు క్రాప్ హాలిడే ప్రకటించారు..సంగారెడ్డిలో 40 వేల ఎకరాలకు క్రాప్ హాలిడే ప్రకటించారు.. మెదక్ జిల్లా ఘనపురం క్రింద 30 వేల ఎకరాలకు క్రాప్ హాలిడే ప్రకటించారు.. సంగారెడ్డి జిల్లాలో ఉండే బీరు కంపెనీలకు మాత్రం ఎటువంటి హాని లేకుండా బీరు కంపెనీలకు నీళ్లు సరఫరా చేస్తున్నారు.

ఎక్సైజ్ శాఖ ప్రధాన కార్యదర్శి ప్రభుత్వ ఆదేశాలతో బీరు కంపెనీలకు నీళ్లు ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చాడు. ఈ ప్రభుత్వం మద్యం తయారీ దారులకు కొమ్ము కాసే ప్రభుత్వంలా ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత గీత కార్మికులను వందల సంఖ్యలో అక్రమ కేసులు పెట్టి జైలు పాలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత 850 మంది గౌడ్స్ మరణించారు. వారికి ఇవ్వాల్సిన ఒక్క రూపాయి ఇవ్వలేదు..

బిఆర్ఎస్ హయంలో 5 లక్షల భీమా పథకం తీసుకొచ్చి గౌడన్నల కుటుంబాన్ని మేము ఆదుకున్నాము.. కాంగ్రెస్ పార్టీ 10 లక్షల భీమా ఇస్తామని చెప్పి....10 రూపాయిలు కూడా ఇవ్వలేదు.రంగారెడ్డి జిల్లా అబ్దుల్లా పూర్ మెట్ మండలం.... లక్ష్కర్ గూడ మీటింగ్ లో రేవంత్ రెడ్డి అనేక మాటలు గౌడన్నలకు చెప్పి మోసం చేశారు. గౌడన్నలు అంటే రేవంత్ రెడ్డికి చిన్నచూపు.

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత రాష్ట్రాన్ని తాగుబోతుల తెలంగాణగా మార్చింది. గల్లీ గల్లీకి మద్యం దుకాణాలు తెచ్చారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో

10 వేల కోట్ల ఆదాయం పెంచుకున్నారు. మహిళలకు తులం బంగారం ఇవ్వడం లేదు గానీ, తాగుబోతుల తెలంగాణగా మాత్రం మార్చారు.

# కంటోన్మెంట్ బోర్డును కార్పొరేషన్‌లోకి విలీనం చేయడానికి లక్ష సంతకాల సేకరణ

**- తొలి సంతకం పెట్టిన బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**సికింద్రాబాద్:** కంటోన్మెంట్ బోర్డు విలీన అంశాన్ని రాజకీయ డ్రామాగా మార్చి ప్రజలను గందరగోళంలోకి నెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయి. విలీనంపై దీక్షలు చేపట్టిన వారు అసలు దీక్ష ఎందుకు మొదలుపెట్టారు? ఎందుకు విరమించారు? అనే అంశంపై ప్రజలకు స్పష్టత ఇవ్వలేదు.

విలీన అంశం ప్రజా సమస్య. ఇలాంటి అంశాన్ని తీసుకుంటే పార్టీలకతీతంగా అందరినీ కలుపుకొని ఐక్యంగా పోరాడాలి. కానీ దీక్ష పేరుతో స్పష్టమైన రోడ్‌మ్యాప్ లేకుండా, ప్రజలను కన్ఫ్యూజ్ చేసేలా వ్యవహరించడం సరికాదు.

విలీనంపై బీజేపీతో సహా వివిధ వేదికలపై విభిన్న వ్యాఖ్యలు రావడంతో ప్రజల్లో సందిగ్ధత పెరుగుతోంది. ఈ నేపథ్యంలో కంటోన్మెంట్ ప్రజాభిప్రాయాన్ని స్పష్టంగా చూపించేందుకు బీఆర్ఎస్ ముందుకొస్తోంది.

కంటోన్మెంట్ విలీనానికి మద్దతుగా లక్ష సంతకాల సేకరణ కార్యక్రమం ప్రారంభిస్తున్నాం. ఈ ఉద్యమానికి




మొదటి సంతకాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో తీసుకొని, ప్రజల ఆకాంక్షను కేంద్రం, రాష్ట్రం సహా సంబంధిత అధికారులకు అందజేస్తాం.

కంటోన్మెంట్ విలీనాన్ని కోరుకునే ప్రతీ ఒక్కరూ పార్టీలకు అతీతంగా, సంఘాలకు అతీతంగా ఈ లక్ష సంతకాల ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నాను. కంటోన్మెంట్ విలీనాన్ని వ్యతిరేకిస్తున్నారని ఈటల రాజేందర్ అనడం స్థానిక బిజెపి ఎప్పటినుంచో కంటోన్మెంట్ బోర్డ్ విలీనం వ్యతిరేకంగా కార్యక్రమాలు చేపట్టడం వారి వైఖరిని తెలియజేసింది.

ఒక పూట తినకుండా ఎనిమిది రోజులు డ్రామా చేసి కనీసం వాళ్ళ కాంగ్రెస్ ఒక్క మంత్రి కూడా తన దీక్షకు రాకపోవడం అకస్మాత్తుగా కాంగ్రెస్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ దీక్షను విరమించడం కేవలం రాజకీయ స్టంట్ కోసమే కంటోన్మెంట్ బోర్డ్ విలీన అంశాన్ని ఎత్తుకున్నారని అర్థమవుతుంది.

బిఆర్ఎస్ లక్ష సంతకాల సేకరణను పూర్తి చేసుకొని ఈటెల రాజేందర్ గారికి , కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్నాథ్ సింగ్ గారికి, రాహుల్ గాంధీ గారికి ఈ పత్రాల కాపీ పంపించి కంటోన్మెంట్ బోర్డ్ కార్పొరేషన్ లోకి విలీనంపై ఎంత స్పందన ఉందో తెలియజేసే కార్యక్రమం నేటి నుంచి చేపడుతుంది.

# మున్సిపల్ ఎన్నికలపై ఈటల రాజేందర్ సుదీర్ఘ కసరత్తు...

**-ఎనిమిది గంటలపాటు సాగిన సమీక్ష.**

**-ఈ గడ్డపై ఎగిరేది కాషాయ జెండానే:**

**- ఎంపీ ఈటల రాజేందర్**

**మల్కాజిగిరి:** పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో మూడు మున్సిపాలిటీలలో ఎన్నికలు జరగనున్నాయి. అలియాబాద్, మూడు చింతలపల్లి, ఎల్లంపేట మున్సిపాలిటీలలో కౌన్సిలర్ల ఎంపికపై స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధ్యక్షులతో ఎంపీ ఈటల రాజేందర్ చర్చలు జరిపారు.

గెలుపు గుర్రాలపై దృష్టిపెట్టారు.

ఎంపీ ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి బ్రహ్మరథం పట్టారు.. మోదీ తోనే అభివృద్ధి జరుగుతుందని ప్రజలు నమ్ముతున్నారని



ఈటల రాజేందర్ అన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు విసిగిపోయారు. భూ కబ్జాలు, పేదల ఇళ్లు కూలగొట్టడం, రౌడీయిజం చేస్తున్నారు. భూ మాఫియాకు కొమ్ము కాస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అమాయక ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయింది.

వారికి ప్రజలు ఓటు వేయడానికి సిద్ధంగా లేరు అని ఈటల రాజేందర్ అన్నారు. అక్కడ ఇక్కడ లేని బిఆరెస్ కి ఓటు వేస్తే వచ్చే ప్రయోజనం లేదని ప్రజలకు అర్థం అయ్యింది. ఇప్పుడు బీజేపీ వైపు ప్రజలంతా చూస్తున్నారు. ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా పనిచేయాలని నాయకులను కోరారు. మూడు మున్సిపాలిటీలపై ఎగిరేది కాషాయ జెండానే అని ఆయన అన్నారు.

తెలుగు దిన పత్రిక
https://aksharagalam.com



అక్షరగళం
నిజం..నిర్భయంగా
గ్రేటర్ -హైదరాబాద్



ఎన్నికల ఏర్పాట్లను పరిశీలిస్తున్న మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి

# మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్..

## ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి..

## వ్యయపరిశీలకుల నియామాకం.....

**మేడ్చల్ కలెక్టరేట్, (అక్షరగళం):** మున్సిపాలిటిలు, మున్సిపల్ కార్పొరేషన్ల సాధారణ ఎన్నికల 2026లో భాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని ఆలియాబాదు, మూడుచింతలపల్లి, ఎల్లంపేట్ మున్సిపాలిటీ లకు ఎన్నికల సాధారణ పరిశీలకులుగా కొర్ర లక్ష్మి ఐఎఎస్, వ్యయ పరిశీలకులుగా సునయన చౌహాన్లు నియమితుల య్యారు. ఈ సందర్భంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి తో కలిసి సాధారణ ఎన్నికల పరిశీలకులు కొర్ర లక్ష్మి ఆలియాబాదు మున్సిపాలిటిలోని పోలింగ్ బూతులను పరిశీలించి కావలసిన మౌలిక సదుపాయాలను, రేలింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఏర్పాటు చేయనున్న జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలలను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. అంతకు ముందు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కు వచ్చిన సాధారణ ఎన్నికల పరిశీలకులు కొర్రలక్ష్మిని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి పూల మొక్క అందించి ఆహ్వానం పలికారు.





కాలనీ ప్రజలతో మాట్లాడుతున్న కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్

# మహావీర్ నగర్ మరియు కమలమ్మ కాలనీ సమస్యలపై కార్పొరేటర్ పాదయాత్ర

**కూకట్‌పల్లి,అక్షరగళం:** ఆల్విన్ కాలనీ సర్కిల్ ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధి లోని మహావీర్ నగర్ మరియు కమలమ్మ కాలనీలలోని పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ జి.ఎచ్.ఎమ్.సి అధికా రులు మరియు కాలనీ వాసులతో కలిసి పాదయాత్ర చేసి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గారు మాట్లాడుతూ మహావీర్ నగర్ మరియు కమలమ్మ కాలనీలలో కొంతమేర డ్రైనేజీ మరియు సీసీ రోడ్లకు సంబందించిన పెండింగ్ వర్క్స్ ఉన్నాయని, వాటిని శేరిలింగంపల్లి శాసన సభ్యులు పి.ఎ.సి చైర్మన్ అరేకపూడి గాంధీ దృష్టికి మరియు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి శాంక్షన్ చేయించి అతి త్వరలో నిర్మాణ పనులు మొదలుపెడ తామని హామీ ఇచ్చారు. కాలనీలలో కొన్నిచోట్ల డామేజ్ అయిన మన్ హోల్ మూతలను వెంటనే మర్చి కొత్తవి అమర్చాలని సంబంధిత అధికారులకు తెలియచేసారు.

డివిజన్ సమగ్ర అభివృద్దే ధ్యేయంగా ముందుకు వెళుతున్నాం అని, దశల వారిగా అభివృద్ధి పనులు చేపడుతామని, కాలనీలో పెండింగ్లో ఉండి అసంపూర్తిగా మిగిలిన పనులను త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

కార్యక్రమంలోయువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, శివరాజ్ గౌడ్, గోపాల్, పాండుగౌడ్, రాజు పటేల్, హరీష్, వీరేష్, నారాయణ, మల్లేష్, శ్రీను, రాం చందర్, రాఘవయ్య, ఏటీఎం శ్రీను, శివ, ప్రతాప్, డి. రాజు పటేల్, దశరథ్, విజయ్, సురేష్, రవి, ప్రకాష్, లింగం, సుధాకర్, సత్తయ్య, రమేష్, రాజు గౌడ్, రవీందర్, ఖలీమ్. జి.ఎచ్.ఎమ్.సి అధికారులు ఎస్.ఆర్.పి నాగేశ్వర నాయక్, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్, యూ బి డి నాగరాణి, ఎంటమాలజీ సూపర్వైజర్ డి.నరసింహులు, వాటర్ వర్క్స్ మేనేజర్ శ్రీనివాస్, వాటర్ వర్క్స్ సూపర్వైజర్ శివ, ఎస్.ఎఫ్.ఎ వెంకటరెడ్డి & మల్లేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# రాజశ్యామల యాగంలో పాల్గొన్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

**సంగారెడ్డి:** రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సంగారెడ్డి లోని పోతిరెడ్డి పల్లి చౌరస్తా సమీపం లో దత్తగిరి ఆశ్రమం అద్వర్యం లో లోక కల్యాణార్థం నిర్వహించిన శ్రీ రాజ శ్యామల యాగం లో పాల్గొన్నారు . ఈ సందర్భంగా దత్తగిరి ఆశ్రమం పీఠాధిపతి అవధూతగిరి మహారాజ్ నేతృత్వం లో పండితులు , వేద పాఠశాల విద్యార్థులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వేద పండితులు తమ మంత్రోచ్ఛారణ తో రాజశ్యామల యాగం ను మంత్రి దామోదర్ రాజనర్సింహ గారిచే నిర్వహించారు. అనంతరం పూర్ణహుతి కార్యక్రమం లో పాల్గోని అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేశారు.

# ఫేక్ వార్తలు ప్రచారం చేసేందుకు సీఎంఓలో వాట్సాప్ గ్రూప్

- టీ షాట్ ,బీ ఆర్ కే భవన్ ,హాకా భవన్ లోని ప్రభుత్వ కార్యాలయాల నుంచి ఈ ఫేక్ ప్రచారం
- తెలంగాణ రైజింగ్ టాక్ కమ్యూనికేషన్ పేరుతో వాట్సాప్ గ్రూప్
- సిట్ చీఫ్‌గా సజ్జనార్ ఏం చేస్తున్నారు?
- ప్రభుత్వ జీతం తీసుకుంటున్న శ్రీరామ్ కర్రీ ప్రతిపక్షాల మీద ఇలాంటి దుష్ప్రచారం చేస్తున్నారు
- బాట్స్ అకౌంట్ ద్వారా బీ ఆర్ ఎస్ ను బద్నామ్ చేస్తున్నారు
- కాంగ్రెస్ బాట్స్ ఆర్మీ కాలకేయ సైన్యం ఘోరంగా తయారైంది
- శ్రీరామ్ కర్రీ ఓ క్రిమినల్
- తక్షణం ఆయనపై కేసు నమోదు చేయాలి
- సోషల్ మీడియాలో ప్రభుత్వ డబ్బుతో బీఆర్ఎస్ పై కాంగ్రెస్ చేస్తున్న ప్రచారాన్ని బట్టబయలు చేసిన కార్పొరేషన్ మాజీ చైర్మన్ మన్నె క్రిశాంక్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాటిమీది జగన్ మోహన్ రావు , బీ ఆర్ ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ విష్ణువర్ధన్ రెడ్డి

**హైదరాబాద్:** రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం దేశంలోనే అత్యంత మిస్ ఇన్ఫర్మేషన్ మాఫియాగా వ్యవహరి స్తోంది. రేవంత్ రెడ్డి ప్రతిపక్షం లో ఉండగా తోటి కాంగ్రెస్ నేత ఉత్తమ్ కుమార్ రెడ్డిపై సోషల్ మీడియా లో ఫేక్ ప్రచారం నడిపారు. ఉత్తమ్ తన వ్యక్తిత్వ హననంమీదరేవంత్‌పై బహిరంగంగానే మాట్లాడారు.

ఫోన్ ట్యాపింగ్ పై జరుగుతున్న సిట్ విచారణ పై ఫేక్ వార్తలు ప్రచారం చేసేందుకు సీఎంఓ లో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటైంది. అక్కడనుంచే నకిలీ వార్తలు సర్క్యులేట్ అవుతున్నాయని మేము ఆధారాలతో సహా బయట పెడుతున్నాం. 138 సభ్యులున్న సీఎంఓ వాట్సాప్ గ్రూప్ నుంచి, తెలంగాణ ఉద్యమ కారుడు ఒకరు విజిల్ బ్లోవర్ గా వ్యవహరించి స్క్రీన్ షాట్ పంపితే అసలు విషయాలు తెలిశాయి.

తెలంగాణ రైజింగ్ టాక్ కమ్యూనికేషన్ పేరుతో వాట్సాప్ గ్రూప్ నడుస్తోంది. సీఎం పీ ఆర్ ఓ అన్వేష్ ,మీడియా డైరెక్టర్ శ్రీరామ్ కర్రీ ,కాంగ్రెస్ సోషల్ మీడియా ఇంచార్జ్ సతీష్ మన్నే , తదితరులు ఈ వాట్సాప్ గ్రూప్ లో సభ్యులు. సీఎంఓ నుంచే ఈ తతంగం నడుస్తోంది. సిట్ చీఫ్ గా సజ్జనార్ ఏం



చేస్తున్నారు

ప్రభుత్వ జీతం తీసుకుంటున్న శ్రీరామ్ కర్రీ ప్రతిపక్షాల మీద ఇలాంటి దుష్ప్రచారం చేస్తున్నారు. అన్వేష్ కూడా ప్రభుత్వ జీతం తీసుకుంటూ ఇలాంటి ప్రచారం చేస్తున్నారు. వేల బాట్స్ అకౌంట్స్ సృష్టిస్తూ తప్పుడు ప్రచారం సర్క్యులేట్ చేస్తున్నారు. సిట్ నుంచి అధికారకంగా రిలీజ్ కాకున్నా, బాట్స్ అకౌంట్ ద్వారా బీ ఆర్ ఎస్ ను బద్నామ్ చేస్తున్నారు

శ్రీరామ్ కర్రీ ఓ క్రిమినల్. ఆయనపై కేసు నమోదు చేయాలి. మీడియా డైరెక్టర్ భాద్యతల నుంచి వెంటనే తప్పించాలి. ఇది డేంజరస్ మాఫియాగా మారి ఈ వాట్సాప్ గ్రూప్ నడిపిస్తోంది. కే టీ ఆర్ ఇమేజ్ డ్యామేజ్ చేయడానికి సీఎం రేవంత్ ప్రోద్భలంతో శ్రీరామ్ కర్రీ ,అన్వేష్ ,మన్నే సతీష్ పని చేస్తున్నారు

బాట్స్ అకౌంట్స్ ఉన్న వాళ్ళే సీఎం ప్రసంగాలను సోషల్ మీడియా లో అహో ఓహో అని ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ పేరడీ అకౌంట్స్ పేరిట బీ ఆర్ ఎస్ మీద వండి వార్చిన కథనాలు సమాజంలోకి వదులుతున్నారు. కాంగ్రెస్ బాట్స్ ఆర్మీ కాలకేయ సైన్యం ఘోరంగా తయారైంది. ఈ వికృత క్రీడ ను డీజీపీ అరికట్టాలి. ఫేక్ న్యూస్ ను ప్రభుత్వం అరికట్టాలి

అయితే కాంగ్రెస్ ప్రభుత్వమే ముందుండి ఫేక్ న్యూస్ ను బరితెగించి ప్రచారం చేస్తోంది. సీఎంఓ నుంచే ఈ ఫేక్ న్యూస్ ముఠా నడుస్తోందని సాక్ష్యాధారాలతో సహా బయట పెట్టాం. ఎన్నో సార్లు డీజీపీ కి ఫిర్యాదు చేసినా కాంగ్రెస్ నేతలపై చర్యలు లేవు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి బీ ఆర్ ఎస్ మహిళలపై వ్యక్తిత్వహననానికి పాల్పడుతున్నారు. టీ షాట్ ,బీ ఆర్ కే భవన్ ,హాకా భవన్ లోని ప్రభుత్వ కార్యాలయాల నుంచి ఈ ఫేక్ ప్రచారం నడుస్తోంది

గత సంవత్సరం ఆగస్టు 29 న ప్రభుత్వ కార్యాలయాల నుంచి ఈ ఫేక్ ప్రచారం నడుస్తోందని ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు కేసు నమోదు చేయలేదు. ఆధారాలు సమర్పించినా చర్యలు లేవు. వందలాది మంది ప్రభుత్వ అధికారులను బీ ఆర్ ఎస్ మీద దుష్ప్రచారానికి వాడుకుంటున్నారు. అనుముల రాజ్యాంగం లో బీ ఆర్ ఎస్ చేసిన ఏ ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదు.

ఇదో వ్యవస్థీకృతమైన నేరం లా మారింది. వచ్చేది బీ ఆర్ ఎస్ ప్రభుత్వమే. అధికారుల మీద చర్యలు తీసుకోకుంటే మేము తీసుకుంటాం. రాష్ట్రంలో లేని సాంప్రదాయాలను తీసుకొస్తున్నారు. పద్దతి మార్చు కోని అధికారులను మేము అధికారం లోకి వచ్చాక చట్టం పరిధిలో శిక్షిస్తాం..



# కేటీఆర్ చేతుల మీదుగా తెలంగాణ ఫోటో జర్నలిస్టుల అసోసియేషన్ 2026 క్యాలెండర్ ఆవిష్కరణ

**హైదరాబాద్:** తెలంగాణ ఫోటో జర్నలిస్టుల అసోసియేషన్ రూపొందించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, సమాజంలోని వాస్తవాలను, ప్రజల కష్టసుఖాలను తన కెమెరా కంటితో బంధించి ప్రపంచానికి చాటిచెప్పే ఫోటో జర్నలిస్టుల సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. వృత్తిపరమైన సవాళ్లను ఎదుర్కొంటూ అద్భుతమైన చిత్రాలను క్లిక్ చేసే జర్నలిస్టులకు అసోసియేషన్ ఎల్లప్పుడూ అండగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

11 ఏళ్లుగా కొనసాగుతున్న సంప్రదాయం

అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి. భాస్కర్ మాట్లాడుతూ, ుఖఏం గత 11 ఏళ్లుగా నిరంతరాయంగా ప్రతి సంవత్సరం ఈ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తోందని తెలిపారు. ఫోటో జర్నలిస్టుల నైపుణ్యాన్ని, వారు తీసిన అరుదైన ఫోటోలను ఈ క్యాలెండర్ ద్వారా ప్రజలకు పరిచయం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

.ఆవిష్కరణ కార్యక్రమంలో అసోసియేషన్‌కు చెందిన పలువురు కీలక నేతలు పాల్గొన్నారు:

జి. భాస్కర్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు ుజచిఏ రాష్ట్రప్రధాన కార్యదర్శి మారుతీ సాగర్ టెంజు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణ కుమార్ నాయకులు యోగి,నవీన్ యార, రాకేష్ రెడ్డి,బాపు రావు,చిన్న యాదగిరి గౌడ్ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# పిఠాపురం రైల్వే స్టేషన్‌ను మోడల్ స్టేషన్‌గా అభివృద్ధి చేయాలి

## రోడ్డు ఓవర్ బ్రిడ్జిని పీఎం గతిశక్తి పథకంలో చేర్చాలి

## కేంద్ర రైల్వే మంత్రిని కోరిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



**న్యూఢిల్లీ:** పిఠాపురం రైల్వే స్టేషన్‌ను అమృత్ పథకం కింద మోడల్ రైల్వే స్టేషన్‌గా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్.. కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా బుధవారం మధ్యాహ్నం ఆయన కేంద్ర మంత్రితో సమావేశమై పిఠాపురం రైల్వే స్టేషన్ అభివృద్ధి, రోడ్డు ఓవర్ బ్రిడ్జి నిర్మాణంతో పాటు పలు కీలక అంశాలపై చర్చించారు.

సేతు బంధన్ పథకం కింద ఇప్పటికే మంజూరైన రోడ్డు ఓవర్ బ్రిడ్జిని పీఎం గతిశక్తి పథకం పరిధిలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఇది 2030 జాతీయ రైల్ ప్రణాళికకు అనుగుణంగా లెవల్ క్రాసింగులను తొలగించేందుకు, ట్రాఫిక్ సమస్యల నివారణకు దోహదపడుతుందని వివరించారు. పిఠాపురం ఆధ్యాత్మికంగా విశేష ప్రాధాన్యం కలిగిన పట్టణమని, అష్టాదశ శక్తిపీఠాల్లో ఒకటైన ఈ క్షేత్రానికి, శ్రీ పాద శ్రీ వల్లభ స్వామి కొలువైన ప్రాంతంగా దేశవ్యాప్తంగా భక్తులు తరలివస్తారని తెలిపారు. అలాంటి పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం రైల్వే స్టేషన్‌లో ఆధునిక మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇక రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న పలు రైల్వే ప్రాజెక్టులపై కూడా కేంద్ర మంత్రితో ఉప ముఖ్యమంత్రి చర్చించారు. ఈ అంశాలపై కేంద్ర రైల్వే మంత్రి సానుకూలంగా స్పందించినందుకు పవన్ కళ్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజల గురించి పట్టించుకునే తీరిక, ఉద్దేశ్యం ప్రభుత్వానికి లేదు

**- మున్సిపల్ ఎన్నికల్లో గొప్ప విజయం సాధించాలి**

**- పార్టీ శ్రేణులకు కెటిఅర్ పిలుపు**

**- తెలంగాణ భవన్ సమావేశంలో కాంగ్రెస్, రేవంత్ రెడ్డిపైన విరుచుకుపడిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఅర్**

**- బీజేపీ నుంచి బీఆర్ఎస్ చేరిన మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్**

హైదరాబాద్: రానున్న మున్సిపల్ ఎన్నికల్లో గొప్ప విజయం సాధించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఅర్ పిలుపునిచ్చారు. రెండు సంవత్సరా?ల్లో అన్ని రంగాల్లో విఫలం అయిన కాంగ్రెస్ పార్టీ పరిపాలనకు వ్యతిరేకంగా అందరూ కలిసికట్టుగా పోరాడి అద్భుతమైన విజయం సాధించాలని పిలుపునిచ్చారు. ప్రజల గురించి పట్టించుకునే తీరిక, ఉద్దేశ్యం కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని అందుకే ఇచ్చిన అన్నీ హామీలను తుంగలో తొక్కిందని కెటిఅర్ అన్నారు.

అన్ని వర్గాలను మోసం చేస్తున్న కాంగ్రెస్ కు ప్రజలు బుద్ధి చెప్పి మున్సిపల్ ఏన్నికల్లో ప్రజకు బిఅర్ ఏస్ వెంట నిలబడతారని కెటిఅర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో అందరు కలిసి సమిష్టిగా ఎన్నికల్లో పోరాడాలని కెటిఅర్ పిలపునిచ్చారు. కేవలం మున్సిపల్ ఎన్నికలు మాత్రమే కాకుండా రానున్న ప్రతి ఎన్నికల్లోనూ గులాబీ జెండాకు, కారు గుర్తుకు మద్దతు ఇచ్చి కేసీఆర్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేయాలని ఆయన కోరారు.

రెండు సంవత్సరాలుగా రాష్ట్రంలో కాంగ్రెస్, 12 ఏండ్లుగా దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ ఎలాంటి అభివృద్ధి చేయకుండా టైంపాస్ చేస్తున్నాయని, అందుకే తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీల పట్ల తీవ్రమైన వ్యతిరేకత ఏర్పడిందని కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ తన అనుచరులతో కలిసి బీజేపీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరగా, పార్టీ కండువా కప్పి కేటీఆర్ సాదరంగా ఆహ్వానించారు. తెలివిలేని వ్యక్తి రాష్ట్రాన్ని పాలిస్తున్నారని, రేవంత్ రెడ్డికి పరిపాలన చేతకావడం లేదని కేటీఆర్ వ్యాఖ్యానించారు. అందుకే గత ప్రభుత్వంపై అడ్డగోలు విమర్శలు చేస్తూ పరిపాలనను వదిలిపెట్టారని అన్నారు. అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి వాటి అమలును పూర్తిగా విస్మరించారని, హామీల అమలును ప్రశ్నిస్తే



బెదిరింపులు, కేసులు, అబద్ధాలకు దిగుతున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి పూర్తిగా అబద్ధాల మీద పరిపాలన చేయడం అలవాటు చేసుకున్నారని విమర్శించారు.

కేవలం పరిపాలన చేతగాక అప్పుల పేరుతో తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. అప్పుల విషయంలో కేంద్ర ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్, కాగ్ (అంఉ) ఏజెన్సీలు నామమాత్రపు అప్పు మాత్రమే ఉందని చెబుతున్నా, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అప్పుల సంఖ్య పెంచి తప్పుడు లెక్కలు చూపుతోందని కేటీఆర్ ఆరోపించారు. అయితే కేసీఆర్ ప్రభుత్వం తెచ్చిన ప్రతి పైసా అప్పును సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకే వినియోగించిందని గుర్తు చేశారు. సాగునీటి ప్రాజెక్టులు, తాగునీటి పథకాలు, విద్యాలయాలు, ఆసుపత్రులు నిర్మించామని పేర్కొన్నారు.

రేవంత్ రెడ్డి రెండు సంవత్సరాల్లో తెచ్చిన రెండున్నర లక్షల కోట్ల రూపాయల అప్పుతో ఒక్కటంటే ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా చేపట్టారా అని ప్రశ్నించారు. ఆ అప్పును ఎక్కడ ఖర్చు పెట్టారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. కనీసం ఒక్క ప్రాజెక్టైనా నిర్మించారా? సంక్షేమంపై ఖర్చు చేశారా? అని నిలదీశారు.

**ఆరూరి రమేష్‌కు స్వాగతం**

తిరిగి పార్టీలోకి వచ్చిన ఆరూరి రమేష్‌కు కేటీఆర్ హృదయపూర్వక స్వాగతం పలికారు. రెండు సంవత్సరాల్లో బీజేపీ-కాంగ్రెస్ వైఫల్యాలను చూసిన తర్వాత ప్రజలంతా కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని అన్నారు. ఆరూరి రమేష్ గతంలో వర్ధన్నపేట నియోజకవర్గాన్ని అద్భుతంగా అభివృద్ధి చేశారని, దాదాపు లక్ష ఓట్ల మెజార్టీతో గెలిచిన ఆయన 16 ఓట్ల తేడాతో ఓడిపోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు.

కానీ రానున్న రోజుల్లో కాంగ్రెస్ పాలనను చూసిన తర్వాత వర్ధన్నపేటలో మరోసారి గులాబీ జెండా ఎగరడం ఖాయమని స్పష్టం చేశారు. గతంలో పార్టీ నాయకులతో పాటు ప్రస్తుతం ఉన్న ప్రతి ఒక్కరినీ కలుపుకొని సమిష్టిగా ముందుకు వెళ్లి రానున్న మున్సిపల్ ఎన్నికల్లో అద్భుతమైన విజయం సాధించాలని ఆరూరి రమేష్‌ను కోరారు.

## కడియం వల్లే నేను పార్టీని వీడా

**- బీఆర్ఎస్‌లో ఉంటూ కాంగ్రెస్ కోవర్టుగా పనిచేసిన కడియం శ్రీహరి**

**- బీఆర్ఎస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ వ్యాఖ్యలు**

హైదరాబాద్: మాజీ మంత్రి కడియం శ్రీహరి లాంటి వ్యక్తుల వల్లే తాను పార్టీ నుంచి బయటకు వెళ్లవలసి వచ్చిందని మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో అనేక మంది మీద బురద చల్లి, వారు రాజకీయంగా ఎదగకుండా చేసిన వ్యక్తి కడియం శ్రీహరి అని ఆరోపించారు.

మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు రేవంత్ రెడ్డితో ములాకత్ కుదుర్చుకొని, వరంగల్ జిల్లాలో అనేక మంది ఓటమికి కారణమైన వ్యక్తి కడియం శ్రీహరి. ఆయన కాంగ్రెస్ పార్టీ కోసం కోవర్టుగా పని చేశారని ఆరోపించారు. ఇప్పుడు ఆ పాపాత్ముడు బయటకు పోయాడు కాబట్టి, తిరిగి సొంత ఇంటికి వచ్చానని.. చిన్నప్పుడు పిల్లవాడు తప్పిపోయిన తర్వాత తిరిగి ఇంటికి వస్తే ఎలా సంబరం ఉంటుందో.. ఇప్పుడు పార్టీలో, తనకు అంతటి సంతోషం ఉందని ఆరూరి రమేశ్ అన్నారు.

# బీజేపీలోకి భారీగా న్యాయవాదుల చేరిక

హైదరాబాద్: బీజేపీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో లీగల్ సెల్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున న్యాయవాదులు పార్టీలో చేరారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు సమక్షంలో జరిగిన కార్యక్రమంలో కొత్తగా చేరిన వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ, జూనియర్, సీనియర్ న్యాయవాదులతో పాటు వారి కుటుంబ సభ్యులు బీజేపీలో చేరడం ఆనందకరమన్నారు. దేశాన్ని వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దే దిశగా కేంద్ర ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందని పేర్కొన్నారు. ఆ పాలన, సంక్షేమ కార్యక్రమాల పట్ల ఆకర్షితులై పెద్దఎత్తున చేరికలు జరిగాయని తెలిపారు.

బ్రిటిష్ పాలన కాలంలో తీసుకువచ్చిన పాత చట్టాలను స్వతంత్ర భారత అవసరాలకు అనుగుణంగా మార్చడంలో ప్రస్తుత ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుందని చెప్పారు. న్యాయవ్యవస్థలో సంస్కరణలు, పెండింగ్ కేసుల పరిష్కారం, ఖాళీ న్యాయమూర్తుల పోస్టుల భర్తీ వేగవంతంగా జరుగుతోందని వివరించారు. తెలంగాణలో యువ న్యాయవాదులకు అవకాశాలు





పెరిగాయని, వెనుకబడిన వర్గాలకు ప్రాధాన్యం లభించిందన్నారు. రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్లు ప్రారంభమయ్యాయని, అన్ని స్థానాల్లో బీజేపీ పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. గత పాలకులు రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచారని, మాటలకే పరిమితమైన పాలన చేశారని విమర్శించారు. కమిషన్ల వ్యవస్థ పెరిగిందని ఆరోపించారు. దేశంలోని పలురాష్ట్రాల్లో బీజేపీ విజయాలు



సాధించిందని, అదే ఉత్సాహంతో తెలంగాణలోనూ డబుల్ ఇంజిన్ ప్రభుత్వానికి బీజం వేస్తామని తెలిపారు. 'సేవ్ తెలంగాణ ? ఓట్ ఫర్ బీజేపీ' నినాదంతో ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ అభివృద్ధి సాధ్యమయ్యేది బీజేపీతోనేనని పేర్కొన్నారు.



## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి

**- మంత్రి పొన్నం ప్రభాకర్**

హైదరాబాద్: మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైందని, ఫిబ్రవరి 11న ఎన్నికలు జరగనున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రజా పాలన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పట్టణాల అభివృద్ధి, పౌర సేవలు, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రణాళికబద్ధంగా ముందుకు వెళ్తున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, వడ్డీలేని రుణాలు, ఇందిరమ్మ చీరల పంపిణీ వంటి పథకాలు ప్రజలకు మేలు చేస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలోని అన్ని పట్టణాలు మరింత అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని ప్రజలను కోరారు. ఈ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలంటే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.

## మున్సిపాలిటీల్లోనూ కాంగ్రెస్‌దే విజయం

**రాష్ట్ర అభివృద్ధిని మరింత వేగవంతం చేస్తాం**

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

మధిర: సర్పంచ్ ఎన్నికల తరహాలోనే మున్సిపల్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు గెలుచుకుంటుందని డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. బుధవారం మధిర నియోజకవర్గ కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికలను ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు



అత్యంత సీరియస్‌గా తీసుకోవాలని, పట్టణ ఇన్‌చార్జీలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. నగరాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేసిందని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజల విశ్వాసాన్ని సంపాదించామని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఇప్పటికే 90 శాతం అమలు చేశామని వెల్లడించారు. సన్నబియ్యం పంపిణీ, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లకు ఐదు లక్షల ఆర్థిక సాయం, ఆరోగ్యశ్రీ పరిమితిని 10 లక్షలకు పెంపు వంటి నిర్ణయాలు పేదల జీవితాల్లో భరోసా నింపాయని అన్నారు. గత పదేళ్లలో నిర్వహించని గ్రూప్-1 పరీక్షను నిర్వహించి ఉద్యోగాలు కల్పించామని, గ్రూప్-2 నియామకాలు కూడా పూర్తి చేశామని చెప్పారు.

విద్యే తెలంగాణ భవిష్యత్తు అని భావించి ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఒక్కో పాఠశాల కోసం 25 ఎకరాల్లో రూ.200 కోట్ల పెట్టుబడితో ప్రపంచస్థాయి సౌకర్యాలు కల్పిస్తున్నామని వివరించారు. రేర్, క్యూర్, ప్యూర్ సమగ్ర విధానంతో రాష్ట్ర అభివృద్ధికి 2047 విజన్ డాక్యుమెంట్‌ను గ్లోబల్ సమ్మిట్‌లో విడుదల చేశామని, ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు లభించాయని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో పొత్తుల అంశంపై పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. సింగరేణి టెండర్ల అంశంపై పూర్తి ఆధారాలతో స్పష్టత ఇచ్చామని, అయినా విమర్శలు చేస్తే అది వారి ఇష్టమని వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్‌రెడ్డి విదేశాల్లో ఉన్న నేపథ్యంలో మున్సిపల్ ఎన్నికలపై సూచనలు చేశారని, మంత్రులు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. రాష్ట్ర క్యాబినెట్ ఉమ్మడి కుటుంబంలా పనిచేస్తూ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు.

# 'మహా' విషాదం

## ఘోర విమాన ప్రమాదం.. అజిత్‌పవార్ దుర్మరణం



**బారామతి: మహారాష్ట్రలో విషాదం చోటుచేసుకుంది. విమాన ప్రమాదంలో ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ దుర్మరణం చెందారు. బుధవారం ఉదయం ఆయన ప్రయాణిస్తున్న విమానం బారామతిలో కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో పవార్ తో పాటు మరో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. జిల్లా పరిషత్ ఎన్నికల ప్రచారం నిమిత్తం ముంబయి నుంచి బారామతి వెళ్తుండగా ఉదయం 8.45 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. సాంకేతిక లోపం కారణంగానే ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఎమర్జెన్సీ ల్యాండింగ్ సమయంలో విమానం అదుపుతప్పి కూలిపోయింది. ఆ వెంటనే భారీగా మంటలు చెలరేగాయి.**

### సంతాపం వ్యక్తం చేసిన ఏపీ క్యాబినెట్

అమరావతి: విమాన ప్రమాదంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ మృతిపై ఏపీ క్యాబినెట్ సంతాపం వ్యక్తం చేసింది. క్యాబినెట్ భేటీ ప్రారంభ సమయంలో అజిత్ పవార్ విమాన ప్రమాద ఘటనను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రస్తావించారు. ప్రమాదంలో అజిత్ పవార్ తో సహా ఐదుగురు చనిపోవడంపై విచారం వ్యక్తం చేశారు. అజిత్ పవార్‌తో తనకు ఉన్న పరిచయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు గురుతు చేసుకున్నారు. ముంబై నుంచి బారామతి వెళ్తుండగా జరిగిన విమాన ప్రమాదంలో అజిత్ పవార్ మరణంతోగ్భ్రాంతికి లోనయ్యానని ఆయన తెలిపారు. మహారాష్ట్ర రాజకీయాల్లో అజిత్ పవార్ మృతి తీరని లోటని వ్యాఖ్యానించారు. మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి మృతికి సంతాపం తెలుపుతూ ఏపీ క్యాబినెట్‌లో తీర్మానం చేశారు.

### అజిత్ పవార్ ఇకలేరనే వార్త దిగ్భ్రాంతికి గురిచేసింది...

మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ ఇకలేరనే వార్త తెలిసి చాలా దిగ్భ్రాంతికి గురయ్యానని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. 'మహారాష్ట్ర రాజకీయాల్లో అజిత్ పవార్ స్ఫూర్తిదాయకమైన ప్రయాణం చేశారు. ఆయన ప్రయాణం ఇంత ఘోరంగా ఆగిపోతుందని కలలో కూడా ఊహించలేదు. అజిత్ పవార్ గారి మృతి మహారాష్ట్రలోని కూటమి ప్రభుత్వానికి తీవ్ర నష్టం. ఒక రాజకీయ దురంధరుడిని మహారాష్ట్ర కోల్పోయింది. అజిత్ పవార్ గారు, అధికారులు, పైలట్ల మృతికి సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నాను. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. అజిత్ పవార్ కుటుంబ సభ్యులు, ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను..' అని ఆయన పేర్కొన్నారు.

### అజిత్ పవార్ మరణం పట్ల కేసీఆర్ సంతాపం

మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ మరణం పట్ల బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ గారు సంతాపం ప్రకటించారు. రైతు ఉద్యమ నేతగా తన ప్రజా జీవితాన్ని ప్రారంభించి, మహారాష్ట్ర రాజకీయాల్లో సీనియర్ రాజకీయ నేతగాఎదిగి , పలు హోదాల్లో పనిచేసిన అజిత్ పవార్ మరణం మహారాష్ట్ర రాజకీయాలకు తీరని లోటని కేసీఆర్ అన్నారు. శోకతప్తులైన వారి కుటుంబ సభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

### అజిత్ పవార్ అకాల మరణం ఎన్డీయే కూటమికి తీరని లోటు

**- కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి**

న్యూఢిల్లీ: మహారాష్ట్రలోని బారామతి సమీపంలో జరిగిన విమాన ప్రమాదంలో ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ మృతి వార్త తీవ్రగ్భ్రాంతికి గురిచేసిందని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి పేర్కొన్నారు. అజిత్ పవార్ అకాల మరణం మహారాష్ట్ర ప్రజలకు, రాష్ట్ర ప్రభుత్వానికి, ఎన్డీయే కూటమికి తీరని లోటని వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రజల తరఫున, కేంద్ర బొగ్గు?గనుల మంత్రిత్వ శాఖ తరఫున ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు తెలిపారు. అజిత్ పవార్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు.

# సంపాదకీయం..


## బహుళ ప్రయోజనాల ఒప్పందం!

ట్రంప్ టారిఫ్‌లతో ప్రపంచం అల్లకల్లోలం అవుతున్నది. అంతేగాకుండా సామ్రాజ్య విస్తరణ కాంక్ష పెరుగు తోంది. సొంతదేశం అమెరికాలోనే ట్రంప్ పట్ల తీవ్ర వ్యతిరేకత వస్తోంది. ఓ వైపు టారిఫ్‌లు మరోవైపు వీసాల కట్టడితో భారత్ లక్ష్యంగా ట్రంప్ పరోక్ష యుద్ధం మొదలు పెట్టాడు. ఒకవైపు ట్రంప్ టారిఫ్‌ల దూకుడు, మరోవైపు చైనా ఆధిపత్యం, కీలక ఉత్పత్తుల సరఫరాలపై నియంత్రణలతో ప్రపంచ వాణిజ్యంలో అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నాయి. ఈయూ-భారత్ ఒప్పందంతో అటు అమెరికా దూకుడుకు అడ్డుకట్ట వేయడం, ఇటు చైనా ఆధిపత్యానికి చెక్ పెట్టడం సాధ్యమవుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. భారత్, యూరోపియన్ యూనియన్ మధ్య వాణిజ్య ఒప్పందంపై 2007లో చర్చలు మొదలయ్యాయి. వివిధ కారణాలతో మధ్యలో నిలిచిపోయాయి. అంటే గత యూపిఎ హయాంలోనే ఈ ప్రక్రియ ప్రారంభం అయ్యిందని చెప్పుకోవాలి. తిరిగి 2022లో చర్చలు ప్రారంభమయ్యాయి. మొత్తంగా రెండు దశాబ్దాల అనంతరం ఒప్పందం కుదిరింది. గ్రీన్‌లాండ్ అంశంలో ట్రంప్ వ్యవహారశైలి, అమెరికా లేకుంటే యూర్‌పను ఎవరూ పట్టించుకోబోరన్న వ్యాఖ్యలు, టారిఫ్ విధిస్తానంటూ బెదిరించడం తో.. ఆగ్రహంతో ఉన్న ఈయూ భారత్‌తో ఒప్పందంపై చర్చలను వేగవంతం చేసింది. ఈక్రమంలో భారత్ ఆచితూచి మసలు కుంటోంది. ప్రపంచ దేశాలతో సయోధ్యకు యత్నిస్తోంది. కొందు చెప్పినట్లుగా అమెరికాను ఎదరించడం ఇప్పుడున్న పరిస్థితుల్లో సాధ్యం కాదు. ఎందుకంటే మన వాణిజ్యానికి తోడు, మన దేశీయులు లక్షల్లో అక్కడ ఉన్నారు. వారి ప్రయోజనాలు కూడా ముఖ్యం. కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు మోడీని విమర్శించడమే లక్ష్యంగా మన విదేశాంగ విధానంపై దుమ్ము పోస్తున్నారు. కానీ ఇది సరైన విషయం కాదు. భారత్, యూరోపియన్ యూనియన్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఎడారిలో ఒయాసిస్సు లాంటిది. వాణిజ్యం



కోసం అమెరికాపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడం, ఇతర మార్కెట్లను అందిపుచ్చు కోవడం దిశగా భారత్ ముందడుగు వేస్తున్న క్రమంలో కొత్త వాణిజ్య ఒప్పందం ఓ పెద్ద ముందడుగా భావించాలి. యూరప్ దేశాలకు ఎగుమతి చేసే చాలా రకాల ఉత్పత్తులపై సుంకాలు పూర్తిగా తొలగి పోనున్నాయి. దీనితో భారత వ్యాపారులు, ఎగుమతిదారులకు దీర్ఘకాలిక ప్రయోజనం కలగనుంది. యూరప్ దేశాల నుంచి భారత్‌కు దిగుమతి అయ్యే కార్లు, వైన్స్, అత్యవసర ఔషధాలు వంటి వాటి ధరలు కూడా తగ్గనున్నాయి. యూరోపియన్ యూనియన్, భారత్ మధ్య భారీ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. దీన్ని 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్' గా అభివర్ణించవచ్చు. ఇటు భారత్‌లోని 140 కోట్ల మంది, ఈయూలోని కోట్లాది మంది ప్రజలకు అద్భుతమైన అవకాశాలు లభిస్తాయి. భారత్, ఈయూ ఉమ్మడి జీడీపీ ప్రపంచ జీడీపీలో 25శాతం. ఇది ప్రపంచ వాణిజ్యంలో మూడో వంతుతో సమానం అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. యూరోపియన్ యూనియన్‌లో భాగమైన 27 దేశాల్లో ఈ ఒప్పందంపై చట్టాలు చేసిన త ర్వాత పూర్తిస్థాయిలో అమల్లోకి రానుంది. ఇందుకోసం ఆరు నెలల నుంచి ఏడాది సమయం పట్టవచ్చని అంచనా వేస్తున్నారు. కాగా, భారత్-ఈయూ సదస్సులో భాగంగా యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ లెయెన్, యూ రోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియా కోస్టాలతో ప్రధాని మోదీ భేటీ అయి.. వాణిజ్యంతోపాటు ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులు, ప్రస్తుత పరిణామాలపై చర్చించారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం తోపాటు మొత్తం 13 అంశాలపై ఒప్పందాలు కుదుర్చుకున్నారు. వచ్చే ఐదేళ్లకు సంబంధించిన ఉమ్మడి వ్యూహాత్మక ఎజెండాను ఆమోదించారు. నిజానికి ఇదో పెద్ద ముందడుగుగా భావించాలి. భారత్ వేస్తున్న అడుగులను ట్రంప్ కూడా గమనిస్తున్నారు. బెదరింపు ధోరణులతో భారత్‌ను కట్టడి చేయడం సాధ్యంకాదని

ఈ ఒప్పందంతో అర్థం కానుంది. ముఖ్యంగా భారత్ వస్తువులకు మార్కెట్ అవసరం. అది ఇప్పుడు కొంత తీరనుంది. 2030 నాటికి భారత్, ఈయూ మధ్య వాణి జ్యం, పెట్టుబడులు, డిజిటల్ కనెక్టివిటీ బలోపేతం చేసేందుకు.. ఉమ్మడి సమగ్ర, వ్యూహాత్మక ఎజెండాను అనుసరించాలని నిర్ణయించారు. ఇది యూరప్ దేశాల్లో భారత యువత ఉద్యోగాలు, విద్య, పరిశోధన రంగాల్లో మంచి అవకాశాలు పొందేందుకు కూడా తోడ్పడనుందని విశ్లేషణలు వస్తున్నాయి. శాస్త్ర సాంకేతిక భాగస్వామ్య ఒప్పందం పొడిగింపు, గ్రీన్ హైడ్రోజన్ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు, రహస్య సమాచారం పరస్పర మార్పిడి ఒప్పందంపై చర్చలు చేపట్టడంపైనా కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా కార్ల దిగుమతిపై భారత్ యూరోపియన్ యూనియన్‌పై ఆధారపడుతోంది. యూరప్ నుంచి దిగుమతి అయ్యే కార్లపై ప్రస్తుతం 125శాతం వరకు సుంకాలు ఉన్నాయి. తాజా ఒప్పందం ప్రకారం కార్లపై సుంకాలు 40శాతానికి తగ్గుతాయి. తర్వాత దశలవారీగా 10శాతానికి తగ్గిస్తారు. దీనితో యూర్‌పకు చెందిన బీఎండబ్ల్యూ, ఆడి, మెర్సిడెజ్, లాంబోర్గిని, పోర్షే వంటి కార్ల ధరలు భారీగా తగ్గుతాయి. మరోవైపు భారత్ నుంచి యూరప్ దేశాలకు ఎగుమతి చేసే కార్లపైనా అక్కడి సుంకాలను 10శాతానికి తగ్గిస్తారు. ఇది భారత కంపెనీలకు ప్రయోజనం కలిగిస్తుంది. ఇలా పరస్పరం సుంకాల మినహాయింపు వల్ల మన ఉత్పత్తుకు కూడా ఎగుమతి మార్కెట్ లభిస్తుంది. ఇకపోతే యూరప్ దేశాల నుంచి భారత్‌కు వచ్చే వైన్, విస్కీ, వోడ్కా, బీర్ వంటివాటిపై 150శాతం వరకు దిగుమతి సుంకాలు ఉన్నాయి. క్యాన్సర్ ఔషధాలు, బరువు తగ్గించే మందులు సహా కీలక ఫార్మా ఉత్పత్తుల ధరలు 11 శాతం వరకు, వైద్య పరికరాలు ధరలు 25శాతం వరకు తగ్గుతాయి. మందుల తయారీకి వాడే ముడి పదార్థాల ధరలు తగ్గడం వల్ల దేశంలో ఫార్మా కంపెనీలకు ప్రయోజనం కలగనుంది. విమానాలు, మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ ఉత్పత్తులపై భారత సుంకాలు తగ్గుతాయి. దీనితో యూరప్ నుంచి వచ్చే సంబంధిత ఉత్పత్తుల ధరలు తగ్గుతాయి. ఇక భారత్ నుంచి యూరప్ దేశాలకు వస్త్రాలు, తోలు ఉత్పత్తులు, ఆభరణాల ఎగుమతులు గణనీయంగా పెరుగుతాయి. బిస్కట్లు, పాస్తా, చాకోలెట్లు, పండ్ల రసాలు వంటి ప్రాసెస్డ్ ఉత్పత్తులు, ఆలివ్ ఆయిల్, ఇతర నూనెలపై సుంకాలు ఎత్తివేయడం వల్ల ధరలు తగ్గే అవకాశం ఉంటుంది. నిజానికి ఇదో పెద్ద విజయంగా, కీలక పరిణామంగా చూడాలి. ప్రపంచంతో పోటీపడి మన ఉత్పత్తులను అమ్ముకోవడానికి అవకాశం ఏర్పడింది. అమెరికా విధిస్తున్న టారిఫ్‌ల బెడద నుంచి ఉపశమనానికి ఈ ఒప్పందం కీలకం కానుందనడంలో సందేహం లేదు.



## నేర్పరితనం ఉంటేనే రాణింపు ! (ఆధ్యాత్మికం)

జీవితంలో నేర్పరితనం అవసరం. నేర్పు లేకుంటే మనుగడ సాగించడం కష్టం. ఔషధ సేవనంతో రోగవిముక్తి పొందవచ్చు. కాని, శత్రు విముక్తికి ఎలాంటి ఉపాయమూ లేదు.'అపకారికి ఉపకారము నెపమెన్నక సేయువాడు నేర్పరి' అన్నాడు సుమతీ శతకకారుడు. అంతటితో శత్రుత్వ నశిస్తుందనలేదు. నేర్పుగా ఎలా జీవించాలో చెప్పాడంతే. నేర్పు అంటే దుష్పరిణామాల నుంచి ఉపాయంగా తప్పించుకోవడం. పాము పడగవిప్పి కాటు వెయ్యాలని మీదకు దూకుతుంటే పాములు పట్టేవాడు ఎలా తప్పించుకుంటాడు? చివరకు పాము తలను దొరకబుచ్చుకుంటాడు... అదీ నేర్పు అంటే ఇలాంటి నేర్పు పొందాల్సిన అవసరం కల్పించే వాడే శత్రువు. మనకు కలిసివచ్చే కాలంలో సిరిసంపదలు, పేరు ప్రఖ్యాతులు వస్తే అకారణ శత్రువులు ఏర్పడతారు. డబ్బుతో పాటే మనలను వ్యతిరేకించే వారు పెరుగుతారు. అసూయాపరులు మనవైపే చూస్తుంటారు. వీరు ఎంత లౌక్యులంటే వారి చూపుల్లో గాని, ప్రవర్తనలోగానీ ఎక్కడా వారి క్షుద్రభావాలు వెల్లడి కావు. పంచదార పలుకులతో మనల్ని ప్రలోభ పెడతారు. పైకి మిత్రులు, ఆత్మీయులు. లోపల అసూయ లావా కుతకుతలాడుతున్న అగ్నిపర్వతాలు. అవకాశం లభిస్తే మొదటి అపకారం వీళ్లే చేస్తారు. చాటున మన గురించి తీవ్రమైన దుష్ప్రచారం చేస్తారు. మనల్ని ఏకాకుల్ని చేయడానికి మిత్ర, బంధువర్గాల్లో మనకున్న మంచి పేరు చెడగొట్టడానికి శతథా యత్నిస్తారు. సోమరిపోతు, నిద్రాప్రియుడు కూడా ఇంట్లోకి పాము ప్రవేశించిందనగానే అప్రమత్తమై వేయికళ్లతో పాము జాడల కోసం వెతుకుతాడు. కనిపించగానే వెర్రి ఆవేశంతో కర్రదెబ్బలు కొడతాడు. ఇక్కడ పామే శత్రువు. దాన్ని చంపకపోతే అది మనల్ని చంపేస్తుంది. అలాగని దానికి నేర్పరితనం కూడా అవసరమే. ఇది ఒంటబట్టిన వారు జీవితంలో నెగ్గుకు రాగలరు.

# యూజీసీ కొత్త రూల్స్‌పై రగడ

### జనరల్ కేటగిరీ విద్యార్థుల నిరసనలు

### - ఎందుకీ వ్యతిరేకత- కొత్త రూల్స్‌లో ఏముంది?

ఉన్నత విద్యా సంస్థల్లో సమానత్వ భావనను పెంపొందించేందుకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) రూపొందించిన కొత్త రూల్స్‌పై మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. ఈ నిబంధనలను వ్యతిరేకిస్తూ బిహార్, ఉత్తర్?ప్రదేశ్, బంగాల్ సహా పలు రాష్ట్రాల్లో జనరల్ కేటగిరీల విద్యార్థులు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జనరల్ కేటగిరీల విద్యార్థులను అభద్రతా భావానికి గురిచేసేలా ఈ రూల్స్ ఉన్నాయని నిరసనకారులు ఆరోపిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థుల్లాగే ఓబీసీ స్టూడెంట్స్‌కు కూడా వివక్ష నుంచి రక్షణ కల్పించేలా నిబంధనల్లో సవరణలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇంతకీ యూజీసీ ఇప్పుడు కొత్త రూల్స్‌ను ఎందుకు తెచ్చింది? ఆ నిబంధనల్లో ఏయే అంశాలను ప్రస్తావించారు? జనరల్ కేటగిరీల విద్యార్థులు ఎందుకు వ్యతిరేకిస్తున్నారు? రాజకీయ నేతలు, విద్యావేత్తలు, విద్యార్థులు ఏమంటున్నారు? ఈ కథనంలో చూద్దాం.

### రూల్స్ కఠినతరం : యూజీసీ నోటిఫికేషన్

సమానత్వ భావనను పెంపొందించే నిబంధనలను దేశంలోని ఉన్నత విద్యా సంస్థల్లో అమలు చేయడం ఇదే తొలిసారేం కాదు. ఇంతకుముందు వరకు '2012 యూజీసీ ఫ్రేమ్ వర్క్'లోని రూల్స్‌ను అన్ని యూనివర్సిటీలు, కాలేజీలు అమలుచేసేవి. అయితే తాజాగా ఈ నిబంధనలను యూజీసీ కఠినతరం చేసింది. ఉన్నత విద్యాసంస్థల్లో సమానత్వాన్ని పెంపొందించే రూల్స్‌లో ఈ మేరకు పలు కీలక సవరణలు చేసి, 2026 జనవరి 13న అధికారిక నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. వర్సిటీలు, కాలేజీల పరిధిలో కులపరమైన వివక్ష చూపడాన్ని నిలువరించడం, అందరికీ సమాన అవకాశాలను కల్పించడం దీని ప్రధాన లక్ష్యమని యూజీసీ వెల్లడించింది. 2012 యూజీసీ ఫ్రేమ్‌వర్క్ స్థానంలో కొత్త రూల్స్‌ను అమల్లోకి తెచ్చామని తెలిపింది.

### 2012 యూజీసీ ఫ్రేమ్ వర్క్ - 2026 కొత్త రూల్స్

2012 యూజీసీ ఫ్రేమ్ వర్క్‌లోని చాలావరకు నిబంధనలు సలహాపూర్వకంగా ఉండేవి. కానీ ఈ ఏడాది తెచ్చిన కొత్త రూల్స్ 'తప్పనిసరి పాటించాలి', 'తప్పనిసరి అమలు చేయాలి' అనే స్పష్టమైన స్వరంతో ఉన్నాయి.

2012 యూజీసీ ఫ్రేమ్ వర్క్‌లో ఓబీసీ విద్యార్థులు అనే పదాన్నే ప్రస్తావించలేదు. కానీ కొత్త రూల్స్‌లో ఓబీసీలను రక్షిత జాబితాలో చేరుస్తూ స్పష్టమైన ప్రస్తావన ఉంది.

రూల్స్‌ను అమలు చేయని ఉన్నత విద్యా సంస్థలపై చర్యలను తీసుకునే అంశమేదీ 2012 యూజీసీ ఫ్రేమ్ వర్క్‌లో లేదు. కానీ కొత్త రూల్స్‌లో దీనిపై స్పష్టమైన ప్రస్తావన ఉంది. యూజీసీ సమానత్వ నిబంధనలను అమలు చేయని వర్సిటీలు, కాలేజీలు గుర్తింపును, గ్రాంట్లను, ఆర్థిక సహాయాన్ని కోల్పోతాయని పేర్కొన్నారు.

2012 యూజీసీ ఫ్రేమ్ వర్క్‌ను అన్ని యూనివర్సిటీలు, కాలేజీలు తమతమ సంస్థాగత నిబంధనలకు లోబడి అమలు చేస్తుండేవి. ఈ రూల్స్‌కు విరుద్ధంగా ఎవరైనా విద్యార్థులు వ్యవహరించినా, వ్యక్తిగతంగా వారిని బాధ్యులను చేసేవారు కాదు. కానీ కొత్త రూల్స్ ప్రకారం ఉన్నత విద్యా సంస్థల్లో సమానత్వ నిబంధనలకు విఘాతం కలిగితే, స్వయంగా యూనివర్సిటీల వీసీలు, కాలేజీల ప్రిన్సిపల్స్ వ్యక్తిగతంగా బాధ్యత వహించాల్సి ఉంటుంది. తీవ్రమైన కేసుల్లో బాధ్యులైన విద్యార్థులకు జైలు శిక్ష పడుతుంది.

### సుప్రీంకోర్టులో పిల్ : జనరల్ కేటగిరీ విద్యార్థుల వాదన ఇదీ

కుల వివక్షను నిరోధించే, సమానత్వాన్ని పెంపొందించే అంశంపై యూజీసీ తీసుకొచ్చిన కొత్త రూల్స్‌ను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. దీనిపై అత్యవసర వాదనలు వినేందుకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తి జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చిలతో కూడిన ధర్మాసనం బుధవారం (జనవరి 28న) అంగీకరించింది. యూజీసీ కొత్త రూల్స్‌లోని 3(సీ) సెక్షన్‌లో ఉన్న కుల వివక్ష విభాగంలో కేవలం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలను మాత్రమే చేర్చడంపై పిటిషనర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు.

అందులో జనరల్ కేటగిరీలను ఎందుకు చేర్చలేదని ప్రశ్నించారు. జనరల్ కేటగిరీల విద్యార్థులు కూడా వివక్షను ఎదుర్కొనే ముప్పు ఉంటుందని పిటిషన్‌లో ప్రస్తావించారు. కులానికి తావు ఇవ్వని రీతిలో వివక్ష అనే పదాన్ని నిర్వచించేలా యూజీసీకి ఆదేశాలు ఇవ్వాలని సుప్రీంకోర్టును పిటిషనర్లు కోరారు. ఈ పిల్‌ను దాఖలు చేసిన వారిలో అడ్వకేట్ వినీత్ జిందాల్, పోస్ట్ డాక్టోరల్ రీసెర్చర్ మృత్యుంజయ్ తివారీ సహా పలువురు ఉన్నారు.

### పాత్రలను గరిటెలతో వాయిస్తూ నిరసనలు

స్టీల్ పాత్రలను గరిటెలతో వాయిస్తూ యూజీసీ రూల్స్‌కు వ్యతిరేకంగా బిహార్‌లో పలుచోట్ల విద్యార్థులు నిరసన తెలిపారు. ఆనాడు కరోనాపై పోరాటానికి పాత్రలను గరిటెలతో కొట్టామని, ఇప్పుడు యూజీసీ కొత్త రూల్స్‌పై సమరానికి వాటిని వినియోగిస్తున్నామని చెప్పారు. తమకు అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఊరుకునేది లేదని జనరల్ కేటగిరీ విద్యార్థులు తేల్చి చెబుతున్నారు. బిహార్‌లోని చాలా జిల్లాల్లో ఈ నిరసనలు జరుగుతున్నాయి. పలుచోట్ల ప్రధాని మోదీ దిష్టిబొమ్మను నిరసనకారులు దహనం చేశారు. కర్ణి




సేన, పరశురామ్ సేన వంటి సంస్థల సభ్యులు నిరసనకారులకు మద్దతు ప్రకటించారు.

### మేం ప్రశ్నించినా జైల్లో పెట్టేలా రూల్స్

"యూజీసీ కొత్త రూల్స్ జనరల్ కేటగిరీల విద్యార్థులపై వివక్ష చూపేలా ఉన్నాయి. ఒకవేళ జనరల్ కేటగిరీ విద్యార్థులపై ఎవరైనా వివక్షను చూపితే, నిలదీసినా ప్రశ్నించినా జైలుకు వెళ్లాల్సి వస్తుందనే భయం పట్టుకుంది. అన్యాయం జరిగితే మేం మౌనంగా భరించాలా ? జనరల్ కేటగిరీ విద్యార్థులను తప్పుడు కోణంలో చూపించే ప్రయత్నం అనేది ఈ కొత్త రూల్స్‌లో కనిపించింది. మాకు చట్టపరమైన రక్షణ కవచాన్ని తొలగించారు. ఇది అన్యాయం. ఇలా చేయడం రాజ్యాంగ వ్యతిరేకం. ఈ సంవత్సరం ఉత్తర్?ప్రదేశ్‌లో గ్రామపంచాయతీ ఎన్నికలు, బంగాల్, తమిళనాడు, కేరళలలో అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. ఇప్పుడు రాజకీయ లబ్ధి కోసమే యూజీసీ నుంచి ఈ తరహా కొత్త రూల్స్ తెచ్చారని అనిపిస్తోంది" అని పట్నా విశ్వవిద్యాలయం విద్యార్థి ఆశిశ్? కుమార్ తెలిపారు.

### అందరికీ న్యాయం- అందరికీ సమానత్వం

"ఏ వర్గం విద్యార్థులు అన్యాయానికి గురైనా నేను మద్దతు ఇస్తాను. అందరికీ న్యాయం జరగాలి. అందరికీ సమానత్వం దక్కాలి. మేం పెద్దపెద్ద కలలతో గ్రామీణ ప్రాంతాల నుంచి యూనివర్సిటీలకు వస్తాం. ఇక్కడ మా ధ్యాస చదువుపైనే ఉండాలి. కానీ కొందరు రాజకీయాల్లోకి లాగుతున్నారు. దయచేసి విద్యాసంస్థలను రాజకీయ యుద్ధభూములుగా మార్చొద్దు" అని పట్నా యూనివర్సిటీ విద్యార్థిని అర్చనా కుమారి అభిప్రాయపడ్డారు.

### వర్సిటీల స్థాయిలోనే వివాదాలను పరిష్కరించాలి!

"యూజీసీ కొత్త రూల్స్ అన్యాయంగా ఉన్నాయి. వీటి ప్రకారం ఎవరైనా ఒక జనరల్ కేటగిరీ విద్యార్థిపై అభియోగం నమోదైతే, తాను నిర్దోషి అని అతడు నిరూపించుకోవాలి. కానీ జనరల్ కేటగిరీ విద్యార్థిపై ఫిర్యాదు చేసిన వ్యక్తి, తనపై వివక్ష జరిగిన ఘట్టాన్ని నిరూపించాల్సిన అవసరం ఉండదు. సమానత్వ భావనకు వ్యతిరేకంగా ఈ రూల్స్ ఉన్నాయి. తీవ్రమైన కేసుల్లో బాధ్యులుగా తేలే విద్యార్థులపై క్రిమినల్ కేసులు, వారికి జైలుశిక్ష వంటి వాటిపై యూజీసీ పూర్తి క్లారిటీని ఇవ్వాలి. ఉన్నత విద్యాసంస్థల్లో ఈ తరహా కఠిన రూల్స్ అమలు చేయడం సరికాదు. యూనివర్సిటీల స్థాయిలో వివాదాల పరిష్కారం జరిగేలా వ్యవస్థలను ఏర్పాటు చేస్తే సరిపోతుంది. ఈ రూల్స్‌ను ఆధారంగా చేసుకొని కొందరు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని దుర్వినియోగం చేసే ముప్పు ఉంటుంది. కొత్త రూల్స్ వల్ల జనరల్ కేటగిరీల విద్యార్థుల్లో ఏర్పడిన అభద్రతా భావాన్ని యూజీసీ తొలగించాలి" అని పట్నా విశ్వవిద్యాలయం విద్యార్థి సాకేత్ కుమార్ చెప్పారు.

### తప్పుచేసే వారికే భయం : కొత్త రూల్స్‌కు నా మద్దతు

"విశ్వవిద్యాలయ సమానత్వ చట్టం ఇప్పటికే అమల్లో ఉంది. ఈ సారి అందులో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులతో పాటు ఓబీసీలను కూడా చేర్చారు. ఉన్నత విద్యా సంస్థల్లో కులం, మతం, లింగం, వైకల్యం ఆధారంగా వివక్ష జరిగితే యూజీసీయే స్వయంగా పర్యవేక్షిస్తుంది. ఎవరైనా వివక్షకు పాల్పడినట్లు తేలితే మూడేళ్ల దాకా జైలు శిక్ష పడుతుంది. బాధ్యుడైన విద్యార్థిని కాలేజీ నుంచి బహిష్కరించే నిబంధన కూడా ఉంది. ఇలాంటి రూల్స్ వల్ల తప్పు చేయాలని ఆలోచించే వారిలో భయం కలుగుతుంది. తద్వారా సమానత్వ భావనకు భద్రత లభిస్తుంది. నేను దీనికి మద్దతు ఇస్తున్నాను" అని బిహార్‌కు చెందిన విద్యావేత్త గురు రెహమాన్ తెలిపారు.

### చిన్న వివాదాలు, క్రిమినల్ కేసులుగా మారే ముప్పు!

"షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల వారికి వేధింపులు, వివక్ష, హింస నుంచి రక్షణ కల్పించడానికి ఉద్దేశించిన కఠినమైన చట్టం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం. ఇప్పుడు ఓబీసీ విద్యార్థులను కూడా ఇలాంటి రక్షణ చట్రంలోకి యూజీసీ తీసుకొచ్చింది. కానీ జనరల్ కేటగిరీల వారిని విస్మరించారు. యూజీసీ కొత్త రూల్స్‌ను అమలు చేస్తే చిన్న వివాదాలు కూడా తీవ్రమైన క్రిమినల్ కేసులుగా మారొచ్చు. ఈ అంశంపైనే జనరల్ కేటగిరీల విద్యార్థుల్లో ఆందోళన, భయం నెలకొంది. అందుకే వారు నిరసనలు తెలుపుతున్నారు" అని సీనియర్ జర్నలిస్ట్ సునీల్ పాండే పేర్కొన్నారు.

### బీజేపీ ఓటుబ్యాంకులో చీలికకు విపక్షాలు యత్నించొచ్చు!

"1960వ దశకంలో యూనివర్సిటీలు, కాలేజీల్లో విద్యార్థుల మధ్య కుల సంబంధిత వివాదాలు జరుగుతుండేవి. కానీ ఇప్పుడు అలాంటి పరిస్థితులేం లేవు. ఇప్పుడు ఇంత కఠినమైన రూల్స్‌ను యూజీసీ తేవాల్సిన అవసరమే లేదు అనేది నా అభిప్రాయం. ఈ కొత్త నిబంధనల వల్ల యూనివర్సిటీ క్యాంపస్‌లలో విద్యార్థుల మధ్య మళ్లీ వివాదాలు రేకెత్తే ముప్పు ఉంటుంది. ఫలితంగా అవి రాజకీయాలకు వేదికగా మారిపోతాయి. బీజేపీకి సాంప్రదాయకంగా అగ్రవర్ణ ఓటర్లలో మద్దతు ఉంది. జనరల్ కేటగిరీ విద్యార్థుల్లో ప్రస్తుతం పెరుగుతున్న అసంతృప్తిని ఆసరాగా చేసుకొని, బీజేపీ ఓటుబ్యాంకులో విభజనలను సృష్టించడానికి ప్రతిపక్ష పార్టీలు ప్రయత్నించే అవకాశం ఉంది" అని సీనియర్ రాజకీయ విశ్లేషకుడు, పట్నా విశ్వవిద్యాలయం మాజీ ప్రొఫెసర్ ఎన్‌కే చౌదరి విశ్లేషించారు.

### ఇది అగ్రవర్ణ విద్యార్థుల ఉనికి సమస్య

"ఈ సమస్య అగ్రవర్ణ విద్యార్థుల ఉనికి, గుర్తింపునకు సంబంధించింది. అందుకే ప్రభుత్వం యూజీసీ కొత్త రూల్స్‌లో సవరణలు చేయాలి. ఎన్నికల సమయంలో విద్యార్థులను పార్టీలు ఓట్లు అడుగుతాయి. కానీ ఆ తర్వాత విద్యార్థుల సమస్యలను పట్టించుకోవు. రాజ్యాంగం అన్ని వర్గాలను సమానంగా చూస్తోంది. యూజీసీ కొత్త రూల్స్‌తో సమానత్వ భావనకు విఘాతం కలిగిస్తోంది. జనరల్ కేటగిరీల విద్యార్థుల ఆందోళనను యూజీసీ అర్థం చేసుకోవాలి" అని బిహార్‌లోని శివహర్ జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు ధర్మేంద్ర కిశోర్ మిశ్రా పేర్కొన్నారు.

### ఈ రూల్స్‌ను వ్యతిరేకిస్తే, రాజ్యాంగాన్ని వ్యతిరేకించినట్టే!

"యూజీసీ కొత్త రూల్స్‌ను మేం సమర్థిస్తున్నాం. విస్తృత అధ్యయనం తర్వాత యూజీసీ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. ఇది దాతృత్వం కాదు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రాజ్యాంగబద్ధమైన హక్కు. చాలా విశ్వవిద్యాలయాల్లో కుల వివక్షకు సంబంధించిన కేసులు పదేపదే వెలుగులోకి వచ్చాయి. అవి మళ్లీ జరగకూడదు అంటే ఇలాంటి కఠినమైన రూల్స్‌ను అమలు చేయాలి. ఈ నియమాలను వ్యతిరేకిస్తే, రాజ్యాంగాన్ని వ్యతిరేకించినట్టే" అని ఆర్‌జేడీ ప్రతినిధి అరుణ్ యాదవ్ తెలిపారు.

### సుప్రీంకోర్టు ఆదేశాన్ని అందరూ అంగీకరిస్తారు!

"అందరూ స్వేచ్ఛగా అభిప్రాయాన్ని వ్యక్తం చేయొచ్చు. ఇది రాజ్యాంగం ప్రసాదించిన హక్కు. సమాజంలోని ఏ వర్గంలోనైనా అసంతృప్తి ఉంటే, అది ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. కొత్త యూజీసీ నిబంధనలపై జనరల్ కేటగిరీ విద్యార్థుల్లో కోపం కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ విషయం సుప్రీంకోర్టు ముందు ఉంది. ప్రతి ఒక్కరూ న్యాయవ్యవస్థను గౌరవిస్తారు. అది ఇచ్చే ఆదేశాన్ని అంగీకరిస్తారు" అని జేడీయూ ఎమ్మెల్సీ, పార్టీ ముఖ్య ప్రతినిధి నీరజ్ కుమార్ ఆచితూచి స్పందించారు.

# ప్రాధాన్యం తగ్గుతున్న గ్రంథాలయాలు

రానురాను గ్రంథాలయాల ప్రాధాన్యం తగ్గుతోంది. ఇంటర్‌నెట్ అందుబాటులోకి వచ్చాక గ్రామాల్లో వీటిపై పెద్దగా ఆసక్తి చూపడం లేదు. గ్రామీణ ప్రాంతాలలో కూడా అంతా సెల్‌ఫోన్‌పైనే ఆధారపడుతున్నారు. గూగుల్ ఓపెన్ చేసి చూస్తున్నారు. దీంతో గ్రంథాలయాలను పట్టించుకునే వారు కరువయ్యారు. పుస్తకాల పఠనంపై ఆసక్తి తగ్గడంతో ఊరూరా గ్రంథాలయాలు నెలకొల్పాలన్న లక్ష్యం నీరుగారి పోతోంది. పోటీ పరీక్షలకు ఎల్లవేళలా పుస్తకాలు అందుబాటులో ఉంచాలి. అయితే గ్రంథాలయాలను పటిష్టం చేసుకుంటూ, ఇంటర్‌నెట్‌ను కూడా అందుబాటులోకి చేసుకునే విధంగా చూడాలని నిపుణులు సూచిస్తున్నారు. గ్రంథాల పఠనంతోనే మేధస్సు పెరుగుతందని అంటున్నారు.

విదేశాల్లో గ్రంథాలయాలకు ప్రాధాన్యం ఇస్తారు. అన్నిరకాలుగా వాటిని తీర్చి దిద్దుతారు. పిల్లలకు కనీసం చదవడం, రాయడం వంటి విషయాలపై అవగాహన కల్పించాలని ఎస్.సి.ఇ.ఆర్.టి ఒక కార్యక్రమాన్ని

చేపట్టింది. ఇటువంటి కార్యక్రమాలను దేశవ్యాప్తంగా నిర్వహించాలి. అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూడా చిన్న,చిన్న పుస్తక మహోత్సవాలను నిర్వహించి స్థానిక రచయితలను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా సాహిత్యాన్ని పరిపుష్టం చేయవచ్చు. అంతెందుకు స్కూళ్ల లో కూడా గ్రంథాలయాలు అతంతగానే ఉంటున్నారు. పాఠ్యపుస్తకాలు తప్ప ఇతర గ్రంథాలు అందుబాటులో ఉండడం లేదు. రెఫరెన్స్ పుస్తకాలు కూడా దొరకడం లేదు. డబ్బుండి కొనుక్కునే వారికి తప్ప పుస్తకాలు లేక లైబ్రరీలు నిరసించి పోతున్నాయి. అంతకుమించి నేటి విద్యార్థుల్లో పఠనాసక్తి తగ్గుతోంది. కేవలం పాఠ్య పుస్తకాలకే పరిమితం అవుతున్నారు. ప్రభుత్వ



కళాశాలలు తగ్గడం, సామాజిక శాస్త్రాలు చదివిన వారికి తగిన ఉపాధి అవకాశాలు లేకపోవడం వల్ల ఆయా శాస్త్రాల అధ్యయనంపై నేటి యువత మొగ్గుచూపటం లేదు. తద్వారా సమాజంతో బంధానికి దూరమవుతున్నారు. పాఠశాలల్లో ఒకప్పుడు లైబ్రేరియన్లు వుండేవారు. ఇప్పుడు ఆ పోస్టులు భర్తీ కావడం లేదు. ఫలితంగా విద్యాలయాల్లో విద్యార్థులకు పాఠశాలల్లో లభిస్తున్న పుస్తకాలపై అవగాహన కలగడం లేదు. ఇటువంటి పరిస్థితులలో సాహితీవేత్తలు, భాషాభిమానులు, స్వచ్ఛంద సంస్థలు గ్రంథాలయ ఉద్యమాలు వంటివి మరోసారి ప్రారంభించాల్సిన అవసరం వుంది. ఈ రోజుల్లో పుస్తక ప్రచురణ కష్టసాధ్యంగా మారింది. పాలకుల నుండి కూడా పెద్దగా ప్రోత్సాహం లభించడం లేదు. కేవలం పోటీ పరీక్షల కోసం ముద్రించే పుస్తకాలకు మాత్రమే డిమాండ్ ఉంటోంది. యువతలో ఎక్కువ మంది సినీ సాహిత్యానికే ప్రాధాన్యత ఇస్తున్నారు. 'యునెస్కో' అంచనా ప్రకారం ప్రతి ఐదు వేల మందికి ఒక గ్రంథాలయం ఉండాలి. మన దేశంలో కేవలం 75వేల గ్రంథాలయాలు ఉన్నాయనేది ఒక అనధికార అంచనా. గ్రంథాలయాల్లో పోస్టుల భర్తీ కూడా సక్రమంగా జరగడం లేదు. చాలా గ్రంథాలయాలను ఆధునీకరించడం లేదు. లైబ్రరీలలో పాత పుస్తకాలే దర్శనమి స్తున్నాయి. గ్రంథాలయ వారోత్సవాలని కూడా మొక్కుబడిగానే నిర్వహిస్తున్నారు. ఆ రోజుల్లోనే అయ్యంకి రమణయ్య గ్రంథాలయాల అభివృద్ధికి పది ఎకరాల స్థలాన్ని దానం చేసి 'గ్రంథాలయ ఉద్యమ పిత'గా పేరు పొందారు. గ్రంథాలయోద్యమం ఎపిలో బాగానే జరిగింది. అనేక ఉద్యమాలకు ఇక్కడ పునాది పడింది.

## ఓంశాంతి మూవీకి

# కపుల్స్‌కు ఆఫర్

తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బా జంటగా నటించిన చిత్రం 'ఓం శాంతి శాంతి శాంతిః' సినిమా శుక్రవారం విడుదల కానుంది. గురువారం ప్రదర్శించనున్న పెయిడ్ ప్రీమియర్స్ టికెట్లపై చిత్ర బృందం.. కపుల్స్‌కు ఆఫర్ ప్రకటించింది. ఒక టికెట్ కొంటే మరొటి ఉచితంగా పొందచ్చని తెలిపింది. ప్రస్తుతానికి.. ఆంధ్రప్రదేశ్‌లో




ప్రీమియర్స్ ప్రదర్శించనున్న థియేటర్ల జాబితాను వెల్లడించింది. ఆ వివరాలివీ.. మరోవైపు, తక్కువ ధరకే తమ సినిమాని చూడొచ్చంటూ రెగ్యులర్ షో టికెట్లపై చిత్ర బృందం ఇప్పటికే ఆఫర్ ప్రకటించింది. సింగిల్ స్క్రీన్స్‌లో రూ.99 జీఎస్టీ; మల్టీప్లెక్స్‌ల్లో రూ.150 జీఎస్టీ. అహంకారం కగిలిన భర్తకు భార్య ఎలా బుద్ధి చెప్పిందన్న కథాంశంతో దర్శకుడు ఏఆర్ సజీవ్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. 'పెళ్లిచూపులు', ' ఈ నగరానికి ఏమైంది' తదితర చిత్రాలతో దర్శకుడిగా సత్తా చాటిన తరుణ్ భాస్కర్ హీరోగా నటించిన తొలి సినిమా ఇది.

## సుహాస్ మరో కామెడీ మూవీ

# హే భగవాన్

'కలర్ ఫోటో', 'రైటర్ పద్మభూషణ్' వంటి సినిమాలతో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సుహాస్, ఇప్పుడు 'హే భగవాన్'తో మరోసారి నవ్వించడానికి సిద్ధమయ్యారు. గోపి అచంట దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి 'రైటర్ పద్మభూషణ్' ఫేమ్ షణ్ముఖ ప్రశాంత్ కథను



అందించగా, వివేక్ సాగర్ సంగీతాన్ని సమకూర్చారు. వెన్నెల కిషోర్, సుదర్శన్, అన్నపూర్ణమ్మ వంటి ప్రముఖ తారాగణం కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే పూర్తయ్యింది.

ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతుండగా, త్రిశూల్ విజనరీ స్టూడియోస్ బ్యానర్‌పై బి. నరేంద్ర రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తండ్రీకొడుకుల మధ్య ఉండే ఎమోషన్‌తో పాటు ఆద్యంతం వినోదాన్ని పంచే ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 20న విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

ఈ సందర్భంగా మూవీ నుంచి టీజర్‌ను విడుదల చేసింది. ఒక రహస్యమైన 'ఫ్యామిలీ బిజినెస్' చుట్టూ తిరిగే ఈ కథలో ఆ వ్యాపారం ఏంటో ఎవరికీ చెప్పకూడదనే ఆసక్తికర నిబంధనతో సాగే తండ్రీకొడుకుల ప్రయాణం హిలేరియస్‌గా ఉండబోతోందని టీజర్ చూస్తే అర్థమవుతోంది. 'అంబాజీపేట మ్యారేజీ బ్యాండు' తర్వాత సుహాస్ మరియు శివాని నాగరం ఈ చిత్రంతో మరోసారి జంటగా నటిస్తున్నారు. ఎలాగైనా నాన్న బిజినెస్‌ను తాను టేకప్ చేయాలని తాపత్రయ పడే పాత్రలో సుహాస్ నవ్వులు పూయిస్తున్నారు. 'ఎంతో మంది ఇళ్లలో దీపాలు వెలిగించాడండీ..' అనే డైలాగులతో పాటు శివాని నాగరం జోక్స్ ఆకట్టుకుంటున్నాయి.



# సెట్‌లో మమ్ముట్టికి సన్మానం

మలయాళ మెగాస్టార్ మమ్ముట్టికి కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే. దాదాపు 40 ఏండ్లుగా సినిమా రంగంలో అతడు అందిస్తున్న సేవలకు గాను ఈ అవార్డును కేంద్రప్రభుత్వం ప్రకటించింది. అయితే ఈ శుభసందర్భంగా ప్రస్తుతం ఆయన నటిస్తున్న 'పాదయాత్ర' సినిమా షూటింగ్ సెట్స్‌లో చిత్ర బృందం మమ్ముట్టిని ఘనంగా సన్మానించింది. భారత ప్రభుత్వం 2026 గణతంత్ర దినోత్సవం సందర్భంగా దేశంలోనే మూడవ అత్యున్నత పౌర పురస్కారమైన పద్మభూషణ్‌ను ఆయనకు ప్రకటించడంతో సెట్స్‌లో పండుగ వాతావరణం నెలకొంది. లెజెండరీ దర్శకుడు అదూర్ గోపాలకృష్ణన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం సెట్స్‌లో యూనిట్ సభ్యులందరూ కలిసి మమ్ముట్టిని సత్కరించి తమ సంతోషాన్ని పంచుకున్నారు. దాదాపు 32 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత మమ్ముట్టి మరియు అదూర్ గోపాలకృష్ణన్ కాంబినేషన్‌లో సినిమా వస్తుండటం, అదే సమయంలో ఈ గౌరవం దక్కడం విశేషం. గతంలో 1998లో పద్మశ్రీ, 2022లో కేరళ ప్రభ పురస్కారాలు అందుకున్న మమ్ముట్టి ఇప్పుడు పద్మభూషణ్ గ్రహీతగా నిలిచారు.

# బోర్డర్-3
## అనౌన్స్ చేసిన టీ సీరిస్

సన్నీ డియోల్ ప్రధాన పాత్రలో నటించిన 'బోర్డర్ 2' బాక్సాఫీస్ వద్ద రికార్డు వసూళ్లతో దూసుకుపోతున్న విషయం తెలిసిందే. రిపబ్లిక్ డే కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం కేవలం ఐదు రోజుల్లోనే రూ.200 కోట్ల మార్కును అందుకుంది.



అయితే ఈ సినిమా సాధించిన భారీ విజయాన్ని పురస్కరించుకుని తాజాగా చిత్ర నిర్మాతలు 'బోర్డర్ 3' గురించి అధికారిక ప్రకటన చేశారు. టీ-సిరీస్ అధినేత భూషణ్ కుమార్ మరియు జేపీ ఫిల్మ్స్ నుంచి నిధి దత్తా కలిసి ఈ ఐకానిక్ ఫ్రాంచైజీని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు చేతులు కలిపారు. ప్రస్తుతం థియేటర్లలో సన్నీడియోల్, వరుణ్ ధావన్, దిల్జిత్ దోసాంజ్ వంటి స్టార్లతో అలరిస్తున్న 'బోర్డర్ 2' ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే రూ.200 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించి బ్లాక్ బస్టర్ దిశగా దూసుకుపోతోంది. ఈ ఓపెనింగ్ వీకెండ్ సక్సెస్ ఇచ్చిన ధీమాతోనే 'బోర్డర్ 3' ప్రాజెక్టును పట్టాలెక్కించడానికి నిర్మాతలు సిద్ధమయ్యారు. ఈ మూడవ భాగంలో కూడా సన్నీ డియోల్ ప్రధాన ఆకర్షణగా నిలవనున్నారని సమాచారం ఉండగా.. మిగిలిన నటీనటులు మరియు సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని మేకర్స్ తెలిపారు. దాదాపు ముప్పై ఏళ్ల తర్వాత మళ్లీ అదే దేశభక్తిని వెండితెరపై ఆవిష్కరించి, ప్రేక్షకుల నుంచి అద్భుతమైన ఆదరణ పొందుతున్నామని, అందుకే ఈ స్ఫూర్తిదాయక ప్రయాణాన్ని 'బోర్డర్ 3'తో కొనసాగిస్తున్నామని నిర్మాతలు సగర్వంగా ప్రకటించారు.

## అల్లు అర్జున్, లోకేశ్ మూవీకి

# సోషల్ మీడియాలో ట్రెండ్

అల్లు అర్జున్ కథానాయకుడిగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో ఓ సినిమా రానున్న విషయం తెలిసిందే. ఎఎ23గా ఇది ప్రచారంలో ఉంది. ఇంకా షూటింగ్ కూడా ప్రారంభం కాని ఈ సినిమా అప్పుడే సోషల్ మీడియాలో రికార్డును సొంతం చేసుకుంది. ఇటీవల ఈ సినిమాను అధికారికంగా ప్రకటిస్తూ.. ఓ థీమ్ సాంగ్ విడుదల చేశారు. ఇప్పుడది సోషల్ మీడియాలో ట్రెండ్ క్రియేట్ చేస్తోంది. ఏకంగా ఈ థీమ్ సాంగ్‌పై ఇన్‌స్టాలో 3,55,000 రీల్స్ క్రియేట్ అయ్యాయి. కొన్ని రోజులుగా ట్రెండ్ అవుతోన్న వీడియోకు ఈ సాంగ్‌ను ఉపయోగిస్తున్నారు. దీంతో 13 రోజుల్లోనే లక్షల రీల్స్ ఈ పాటతో క్రియేట్ అయ్యాయి. అత్యధిక రీల్స్ పొందిన థీమ్ సాంగ్‌గా ఈ పాట రికార్డు నెలకొల్పింది. ఇప్పటికీ టాప్‌లో కొనసాగుతోంది. ఈ ఏడాదిలో ఈ సినిమా షూటింగ్



ప్రారంభం కానుంది. ఇక అల్లు అర్జున్ ప్రస్తుతం అట్లీ దర్శకత్వంలో ఓ చిత్రంలో నటిస్తున్నారు. భారీ బ్జడెట్‌తో రూపొందుతున్న ఈ మూవీలో దీపికా పదుకొణె కథానాయికగా కనిపించనున్నారు. సైన్స్ ఫిక్షన్ జానర్‌లో దీన్ని తీర్చిదిద్దుతున్నారు. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా అట్లీ దీని గురించి మాట్లాడుతూ.. అద్భుతమైన అవుట్‌పుట్ కోసం నిద్ర లేని రాత్రులు గడుపుతున్నట్లు చెప్పారు. అభిమానులకు అదిరిపోయే సర్‌ప్రైజ్‌ను సిద్ధం చేస్తున్నామని తెలిపారు.

## ఒత్తిడి తట్టుకుంటూనే ఉన్నా: తరుణ్ భాస్కర్

తెలుగు సినీ పరిశ్రమలో వైవిధ్యమైన సినిమాలతో అలరిస్తున్నవారిలో తరుణ్ భాస్కర్ ఒకరు. తన ప్రత్యేక కథా శైలి, వినూత్న ప్రయత్నాలతో ఆయనను 'స్టోరీ మేకర్'గా గుర్తిస్తారు. తాజాగా ఆయన దర్శకత్వంలో రూపొందిన 'ఓం శాంతి శాంతి శాంతిః' జనవరి 30న థియేటర్లలో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా తరుణ్ భాస్కర్ మీడియాతో తన ప్రయాణాన్ని పంచుకున్నారు. తరుణ్ తన కెరీర్ మొదటి సినిమాగా వచ్చిన 'పెళ్లి చూపులు' విజయాన్ని గుర్తు చేసుకుంటూ, 'ఆ విజయం నా కోసం ఎక్కువ ఒత్తిడిని తెచ్చింది' అని చెప్పారు. ఆ సమయంలో ఆయనకు ఎదురైన భయాలు, ఆందోళనలు, విజయంతో పాటు వచ్చిన బాధ్యతలన్నీ మామూలు అనుభవం కాదని అన్నారు. సినిమా రిలీజ్ సమయంలో హార్ట్ ఎటాక్ వచ్చినంత పనైందని స్పష్టం చేశాడు. విజయాన్ని సులభంగా స్వీకరించడం, అపజయాన్ని అధిగమించడం నిజమైన విద్య అని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సినిమాలో హీరోయిన్ గా ఈషా రెబ్బ నటించగా, యూత్ ఫుల్ ఎలిమెంట్స్, హ్యూమర్, సెంటిమెంట్ అన్నీ తగినంత మేళవించ బడ్డాయని తెలిసింది. తరుణ్ తన ప్రత్యేకమైన శైలిలో కథను రాసి, ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నారని నిర్మాతలు తెలిపారు. కేవలం దర్శకుడిగా కాకుండా, నటుడిగా కూడా తన మార్క్ సినిమాలను కొనసాగిస్తూ, ప్రతి సినిమాతో లోకల్ కల్చర్ ను విశేషంగా ప్రతిబింబించాలను కుంటున్నారని ఆయన చెప్పినారు. తరుణ్ భాస్కర్ ఈ ప్రయాణంలో ఒక బలమైన పాఠాన్ని అందించారు. విజయం వచ్చినా, విఫలం అయినా, దానిని తట్టుకోవడమే నిజమైన గెలుపు. 'పెళ్లి చూపులు' నాటి ఆందోళనల నుండి నేడు 'ఓం శాంతి శాంతి శాంతిః' వరకు ఆయన నిరంతర కృషి, క్రియేటివిటీ, ధైర్యం యువ దర్శకులకు మార్గదర్శకం. జనవరి 30న విడుదలయ్యే ఈ సినిమా కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.



# పెళ్లి చూపుల నుంచి నేటి వరకు...



## అక్కకు తమ్ముడు

# రామ్‌చరణ్ గిఫ్ట్

మెగాస్టార్ చిరంజీవి కెరీర్‌లో మరో మైలురాయిగా నిలిచిన చిత్రం 'మన శంకర వరప్రసాద్ గారు'. సంక్రాంతి కానుకగా విడుదలైన ఈ సినిమా రీజినల్ ఇండస్ట్రీలో హిట్‌గా నిలిచి, బాక్సాఫీస్ వద్ద వసూళ్ల ప్రభంజనం సృష్టించింది. చాలా కాలం తర్వాత చిరంజీవిని ఫుల్ ఫామ్‌లో చూసిన అభిమానులు ఈ సినిమాను పండగలా సెలబ్రేట్ చేశారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను సుస్మిత కొణిదెల, సాహు గారపాటి నిర్మించగా, ప్రతి వర్గం ప్రేక్షకులను ఆకట్టుకుంది. అయితే ఈ చిత్రాన్ని అంత అద్భుతంగా నిర్మించినందుకు రామ్ చరణ్.. తన సోదరి సుస్మితకి క్యూట్ గిఫ్ట్ ఇచ్చారు. సుస్మిత కొణిదెల రీసెంట్‌గా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. నాన్నకి చాలా మంచి గిఫ్ట్ ఇచ్చావు.సినిమా చాలా అద్భుతంగా వచ్చింది.ఇప్పుడు నీకు దిష్టి తగులుతుంది కాబట్టి ఇది వేసుకో అని రామ్ చరణ్ తన అక్కకి ఈవిల్ ఐ బ్రేస్‌లెట్‌ని గిఫ్ట్‌గా ఇచ్చాడని రామ్ చరణ్ సోదరి సుస్మిత తెలియజేశారు. తమ్ముడు చూపించిన ప్రేమపై మెగా డాటర్ ఫుల్ ఖుష్ అయింది. ఆమె చేసిన కామెంట్స్ కూడా ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

PUBLISHED BY G.KALPANA AND PRINTED AT YAGNA PRINTERS AND PUBLICATIONS, H.NO 18-105/4, OPP HANUMANPET, MALKAJGIRI(M)MEDCHAL- 500047, MEDCHAL MALKAJGIRI DISTRICT,TELANGANA PUBLISHED FROM H.NO02-66/254,MALLAREDDY NAGAR PHASE 1, GAJULARAMARAM, QUTHBULLAPUR, MEDCHAL-500055, DISTRICT MALKAJGIRI ,TELANGANA, EDITOR : G.DAYAKAR REDDY , RNI :TELTEL/2022/83927, PHONE NUMBER 9908293393,040- 45046154